మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 02 సోమవారం | డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 77

Navabhoomi daily fallows..




# భారీ ఎన్‌కౌంటర్

◆ ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంలో ఎదురుకాల్పులు
◆ నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి బద్రు సహా 7గురు మృతి!
◆ చల్పాక అటవీ ప్రాంతంలో తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ
◆ మావోయిస్టు బృందం సంయుక్తంగా కూంబింగ్
◆ పోలీసు బృందాలకు ఎదురుపడిన మావోయిస్టులు
◆ ఎన్‌కౌంటర్ అనుమానాస్పదమని పౌరహక్కుల సంఘం ఆరోపణ

2



**ములుగు-నవభూమిబ్యూరో**

ములుగు జిల్లాలోని ఏటూరునాగారంలో ఈ ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కీలక నేతలైన నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి బద్రు అలియాస్ పాపన్న సహా పలువురు ఉన్నారు. చల్పాక అటవీ ప్రాంతంలో తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్టు బృందం సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇరు వర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి.

**మృతి చెందింది వీరే..**

మృతి చెందిన మావోయిస్టులను కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), ఎగొలాపు మల్లయ్య అలియస్ మధు (43), ముస్సాకి దేవల్ అలియస్ కరుణాకర్ (22), ముస్సాకి జమున (23), జైసింగ్ (25), కిషోర్ (22), కామేశ్ (23)గా గుర్తించినట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. వారిని నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

## ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు
# స్వీకరించిన జై షా



● అత్యంత చిన్న వయసులో ఐసీసీ చైర్మన్‌గా జై షా
● జై షా వయసు 35 సంవత్సరాలు
● అన్నీ తానై భారత క్రికెట్‌ను నడిపిస్తున్న షా
● ఐసీసీ పీఠం ఎక్కిన ఐదో భారతీయుడు జై షా
● హెూంమంత్రి అమిత్‌షా కుమారుడే జై షా

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి అయినప్పటికీ, భారత క్రికెట్ దశ దిశ అన్నీ తానై నడిపిస్తున్న జై షా... ఇప్పుడు ఐసీసీ పీఠాన్ని అధిష్ఠించారు. ఐసీసీ నూతన చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జై షా ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.

ప్రస్తుతం జై షా వయసు 35 ఏళ్లు కాగా... ఐసీసీ చైర్మన్ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా ఘనత అందుకున్నారు. అంతేకాదు, ఐసీసీ పీఠం ఎక్కిన ఐదో భారతీయుడు జై షా. ఇప్పటివరకు ఐసీసీలో భారత్‌కు ప్రముఖ స్థానం దక్కుతూ వస్తోంది. గతంలో జగ్మోహన్ దాల్మియా (1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసీసీ అధ్యక్షులుగా పనిచేయగా... ఎన్ శ్రీనివాసన్ (2014-15), శశాంక్ మనోహర్ (2015-2020) ఐసీసీ చైర్మన్లుగా వ్యవహరించారు.

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తనయుడైన జై షా... 2009లో క్రికెట్ పాలనా వ్యవహారాల్లో తన ప్రస్థానం ప్రారంభించారు. గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన షా... అహ్మదాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంను నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. 2019లో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగానూ, ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ చైర్మన్‌గానూ వ్యవహరించారు.

## 9 నుంచి అసెంబ్లీ
# శీతాకాల సమావేశాలు

◆ రైతు భరోసా విధివిధానాలు, కులగణన వివరాలపై ప్రధానంగా చర్చ
◆ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ యోచన



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో రైతు భరోసా విధివిధానాలు, కులగణన వివరాలపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉన్నది. అయితే ఈ సమావేశాల్లో.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అటకెక్కించడంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం

-2లో

## సంక్రాంతి తర్వాతే..
# రైతు భరోసా



● రైతు భరోసా అమలుపై రేవంత్ కీలక ప్రకటన..!!
● రైతులకు ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తా
● ఎవరు వచ్చి ఏం చెప్పినా నమ్మవద్దు
● భట్టి కమిటీ ఇచ్చే నివేదికను అసెంబ్లీలో చర్చకు..
● రైతు భరోసా అమలుపైన సభలో అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే నిర్ణయం: సీఎం రేవంత్

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ కీలక ప్రకటన చేసారు. తెలంగాణలో రైతులు నిరీక్షిస్తున్న రైతు భరోసా అమలుపైన సీఎం రేవంత్ స్పష్టత ఇచ్చారు. ఎప్పుడు అమలు చేసేదీ వెల్లడించారు. అదే విధంగా సన్నాలు పండించే రైతులకు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చా రు. రెండు లక్షల వరకు రైతులు అందరికీ రుణమాఫీ చేసామని రేవంత్ స్పష్టం చేసారు. రైతులకు ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేస్తామని.. ఎవరు వచ్చి ఏం చెప్పినా నమ్మవద్దని కోరారు. ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి చేసి చూపించామని రేవంత్ గుర్తు చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రైతులకు రైతు భరోసా అమలు పై స్పష్టత ఇచ్చారు. ఏడాది పాలన పైన సంతృప్తి ఉందని రేవంత్ వెల్లడించారు. రైతు భరోసా పైన ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం నియమించిన విషయాన్ని గుర్తు చేసారు. భట్టి కమిటీ ఇచ్చే నివేదికను ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టి చర్చిస్తామని చెప్పారు. రైతు భరోసా అమలు పైన సభలో అందరి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఎంత మేర అమలు చేస్తారు.. ఎన్ని ఎకరాలకు పరిమితం చేయాలనేది చర్చ జరుగుతోంది. సాగు చేసే రైతులకు ఇవ్వాలనే చర్చ వినిపిస్తోంది. దీంతో, రైతు భరోసా అమలుపైన సబ్ కమిటీ వేసినట్లు సీఎం వెల్లడించారు. శాసనసభలో చర్చ తరువాత అమలు పైన నిర్ణయం తీసుకుంటామని రేవంత్ స్పష్టం చేసారు. సంక్రాంతి తరువాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని

## సచివాలయ సిబ్బందికి
# సర్కార్ షాక్!

◆ ప్రతీ నెలా 1న ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పెన్షన్ల పంపిణీ
◆ నిర్ణీత సమయంలో పెన్షన్లు పంపిణీ చేయలేదని
◆ వార్డు, గ్రామ సచివాయాల సిబ్బందికి ప్రభుత్వం షోకాజ్ నోటీసులు
◆ సాంకేతిక సమస్యల కారణంగా తాము లాగిన్ కాలేదంటున్న సిబ్బంది

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ ప్రభుత్వ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వైసీపీ హయాంలో ఏర్పాటైన వార్డు, గ్రామ సచివాలయాల నిర్వహణ.. సిబ్బంది విషయంలో ప్రభుత్వం కొత్త కార్యాచరణ సిద్ధం చేస్తోంది. గ్రామ సచివాలయాలను పంచాయితీలతో అనుసంధానం చేసే విధంగా కసరత్తు చేపట్టింది. అదే విధంగా సిబ్బంది విషయంలోనూ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాలు వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు షాకింగ్‌గా మారాయి. తాజా నిబంధనలు వార్డు, గ్రామ సచివాయాల

# పారిపోలేదు..

● చట్టాన్ని గౌరవిస్తా...హైదరాబాద్‌లోనే ఉన్నా
● నాపై 5 కేసులు పెట్టడం వెనుక కుట్ర ఉంది
● నా రిప్లయికు పోలీసులు స్పందిస్తే విచారణకు వస్తా
● అరెస్ట్ చేస్తారనే ముందస్తు బెయిల్ ఫిటిషన్ వేశా
● ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ స్పష్టీకరణ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణకు హాజరుకావాలని ఏపీ పోలీసులు 2 సార్లు నోటీసులు పంపినప్పటికీ.. విచారణకు వెళ్లలేదు వర్మ. ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాడు.కాగా తానేనెక్కడికీ పారిపోలేదు. చట్టాన్ని గౌరవిస్తా. ఇంకో షాక్ ఏంటంటే పోలీసులు ఇంత వరకు నా ఆఫీసులోకి కాలే పెట్టలేదంటూ ట్వీట్‌లో పేర్కొన్నాడు వర్మ. తాజాగా మీడియాతో వర్మ మాట్లాడుతూ.. నేను పారిపోలేదు.. హైదరాబాద్‌లోని డెన్‌లో ఉన్నా. నాపై ఐదు కేసులు పెట్టడం వెనుక కుట్ర ఉంది. నా రిప్లైపై పోలీసులు స్పందిస్తే విచారణకు వెళ్తానన్నాడు. అరెస్ట్ చేస్తారనే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశా. అభిప్రాయాలు తెలుసుకునేందుకు ట్వీట్లు పెట్టా. నా ట్వీట్ల వెనుక రాజకీయ దురుద్దేశం లేదని క్లారిటీ ఇచ్చాడు. మరి దీనిపై పోలీసులు

# 3 రోజులు వానలు

● తెలంగాణలో 3 రోజులు వానలు:హెచ్చరించిన ఐఎండీ
● ఎల్లో అలెర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
● ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. హిందు మహాసముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను నేపథ్యంలో తమిళనాడుతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే.

తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. హిందు మహాసముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను నేపథ్యంలో తమిళనాడుతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోనూ వర్షాలుపడుతాయని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో

# చంద్రబాబుకు షాకిచ్చిన జేసీ

● కడప జిల్లాలో ఆధిపత్యం కోసం జేసీ యత్నాలు
● ఫ్లైయాష్ రవాణా విషయంలో బీజేపీ,టీడీపీ నేతల మధ్య వార్
● సిమెంట్ ఫ్యాక్టరీకి జేసీ వర్గీయులు ఫ్లైయాష్ తరలింపు
● ఫ్లైయాష్‌పై రోజుకు రూ. 2 నుంచి 5 లక్షల వరకు చేతులు మారుతున్నాయనే ప్రచారం
● బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి,జేసీ మధ్య విభేదాలు
● ఇద్దరినీ భేటీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు,జేసీ డుమ్మా

2



**అనంతపురము-నవభూమిబ్యూరో**

టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య విభేదాలు బయటపడ్డాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, బీజేపీ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిల మధ్య విభేదాలు తాం స్థాయికి చేరుకున్నాయి. ఎన్నికల్లో గెలిచిన దగ్గర నుంచి జేసీ ప్రభాకర్ రెడ్డి తన అధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే తన పక్క జిల్లా అయిన కడపలో సైతం ఆయన వేలు పెట్టారు.కడప జిల్లాలోని రాయల సీమ థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.ఫ్లైయాష్ రవాణా విషయంలో ఇరు పార్టీల నేతల మధ్య వార్ మొదలైంది. ఫ్లైయాష్ జమ్మలమడుగు పరిధిలోకి వస్తుంది. తమ నియోజకవర్గంలో జరిగే పనులు తమ ఆధీనంలోనే ఉండాలని ఎమ్మెల్యే ఆదినారాయణ పట్టు బడుతున్నారు. కానీ, తాడిపత్రి నియోజక వర్గంలోని సిమెంట్ ఇండస్ట్రీకి జేసీ వర్గీయులు ఫ్లై యాష్‌ను తరలిస్తున్నారు.దీంతో ఇరు పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకుంటు న్నారు. ఫ్లైయాష్‌పై రోజుకు రూ. 2 నుంచి 5 లక్షల రూపాయిల వరకు చేతులు మారుతు న్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో దీనిపై ఇరు నేతలు కూడా గట్టిగానే పట్టుపడుతున్నా రు. దీంతో ఈ పంచాయితీ చంద్రబాబు వద్దకు చేరింది. కూటమి నాయకులు సఖ్యతగా ఉండాలని చెబుతుంటే రోడ్డున పడతారా? అంటూ వారిపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన జేసీ, ఆదినారాయణ రెడ్డిలను స్వయంగా అమరావతికి కలవాలని

# బీజేపీకి కొత్త రక్తం

◆ సంస్థాగత ఎన్నికల తర్వాత కొత్త అధ్యక్షుడి ప్రకటన
◆ ఇప్పటికే ప్రచారంలో ఈటల రాజేందర్ పేరు
◆ బీసీ వాదం ఉద్ధృతమవుతున్న దశలో బీసీనేతకే ఛాన్స్
◆ ఈ నెలాఖరులోగా టి.బీజేపీకి కొత్త అధ్యక్షుడి రాక



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాష్ట్ర బీజేపీకి కొత్త రక్తం ఎక్కించే ప్రయత్నాల్లో అధిష్టానం ఉంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీకి సీట్లతో పాటు ఓట్ల శాతం పెరగడంతో పార్టీలో జోష్ పెరిగింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకోవచ్చునని అధిష్టానం అంచనా వేస్తోంది.దీనిలో భాగంగానే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చే ఆలోచనల్లో ఉంది. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పీఠానికి ఒకరిని ఎంపిక చేసినట్లు ప్రచారం సాగుతోంది. సంస్థాగత ఎన్నికలు నెలాఖరిలోగా పూర్తి చేసి,అధ్యక్షుడిని ప్రకటించాలని అధిష్టానం యోచిస్తోంది.

సభ్యత్వాల నమోదు ఇటీవలే పూర్తి చేసిన రాష్ట్ర బీజేపీ ఈనెల 10లోగా బూత్ కమిటీల ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించింది. అలాగే 20లోగా మండల కమిటీలు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఆ తర్వాతే అధ్యక్షుడిని ప్రకటించే అవకాశముంది.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగే అవకాశముంది. కనుక బీజేపీ పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసి, ఎన్నికలగోదాలోకి దిగాలన్నది అధిష్టానం ఆలోచన.ఇప్పటికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఈటల రాజేందర్ పేరు ప్రచారంలో ఉంది. రాష్ట్రంలో బీసీ వాదం మొదలై,ఉధృతంగా రగులుకొనే అవకాశమున్న తరుణంలో ఈటలకు పదవిని అప్పగిస్తే,లాభపడుతామన్న ఆలోచనల్లో బీజేపీ ఉంది. అయితే అధ్యక్షుడి పదవికై ఎంపీలు,ఎమ్మెల్యేలు ఆశ పడుతున్నారు.

# నటి శోభిత ఆత్మహత్య..!

◆ ప్రముఖ కన్నడ బుల్లితెర నటి శోభిత ఆత్మహత్య
◆ గచ్చిబౌలిలోని తన నివాసంలో ఉరివేసుకున్న నటి
◆ రెండేళ్ల కిందట సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పెళ్లి
◆ నటన మానేసి, భర్తతో పాటే హైదరాబాద్‌కు
◆ 12పైగా కన్నసీరియళ్లు..నాలుగైదు సినిమాల్లో యాక్టింగ్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

సినిమా ఇండస్ట్రీలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. ప్రముఖ కన్నడ బుల్లితెర నటి శోభిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె కన్నడంతో పాటు తెలుగులోనూ పలు సీరియల్స్‌లో నటించారు. కన్నడంలో ఏరేండ్లతూ, ఏటీఎం, జాక్‌పాట్, అపార్ట్‌మెంట్ టు మర్డర్, వందన చిత్రాల్లో నటించింది. బ్రహ్మగతంతు, నినిదలే తదితర టీవీ సీరియల్స్‌లో నటించింది. ప్రస్తుతం తెలుగులోనూ పలు సీరియల్స్ చేస్తున్నది. శోభిత గతేడాది ఆత్మహత్య చేసుకున్నది. రెండేళ్ల కిందట పెళ్లి చేసుకొని స్థిరపడింది. ఆదివారం గచ్చిబౌలిలోని తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అయితే, ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

శోభిత స్వస్థలం కర్ణాటక హాసన్‌లోని సకలేశ్‌పూర్. స్థానికంగానే గ్రాడ్యు యేషన్ పూర్తి చేసి బెంగళూరుకు చేరింది. శోభిత 12పైగా కన్నడ సీరియల్స్‌లో పనిచేసింది. చిద పాట, మంగళగౌరి, కోగిలే, బ్రహ్మ గంతు, కృష్ణ రుక్మిణి, మణెదేవ తదితర సీరియల్స్‌లో నటించింది.

## రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రను తిప్పి కొట్టాలి

మాలల సింహగర్జన
ఆత్మగౌరవ సభ డిమాండ్

2



## కాగజ్‌నగర్, సర్పూర్ టీ మండలాల్లో 144 సెక్షన్

**కొమురం భీం-నవభూమి:** జిల్లాలో పెద్దపులి టెన్షన్ కొనసాగుతోంది. రెండు రోజుల్లో పెద్దపులి ఇద్దరిపై దాడి చేసింది. మహిళను చంపింది. రైతుపై దాడి చేసింది. ఈ ఇద్దరిపై దాడి చేసింది ఒకే పులి అని నిర్ధారణ అయింది. అటు పులి కదలికలను గుర్తించడంలో అటవిశాఖ విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్దపులి విషయంలో తమను అప్రమత్తం చేయలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు దాడి జరిగిన తర్వాత అధికారులు హడావుడి చేస్తున్నారని అంటున్నారు. అయితే తాము అప్రమత్తంగానే వ్యవహరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.మరోవైపు పెద్దపులి కదలికల నేపథ్యంలో కాగజ్‌నగర్, సర్పూర్ టీ మండలాల్లోని 15 గ్రామాల్లో 144 సెక్షన్ (144 కొనసాగుతోంది. అభరాణ్యంలో ఉండాల్సిన పులులు జనారణ్యంలో తిరుగుతున్నాయి. గ్రామల పొలిమేరలోకి వచ్చి వరుస దాడులు చేస్తూ.. మూగజీవాలు, మనుషులను హతమారుస్తున్నాయి. పులిదాడిలో వ్యవసాయ కూలీ మరణించగా రైతు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానిక ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది.జిల్లాలో పెద్దపులి మరోసారి దాడి చేసింది. సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ శివారులో ఓ రైతుపై పులి దాడికి తెగబడింది. పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన రైతు సురేశ్‌పై దాడి చేసి అతన్ని తీవ్రంగా గాయపరిచింది. రైతు సురేశ్ కేకలు పెట్టడంతో చుట్టుపక్కల రైతులు అప్రమత్తమయ్యారు. అంతా కలిసి గట్టిగా కేకలు వేయడంతో పులి అక్కడ్నుంచి పారిపోయింది.



## పోలీస్ కిష్టయ్య కుటుంబానికి ఎమ్మెల్సీ కవిత భరోసా..



**హైదరాబాద్-నవభూమి:** మలిదశ తెలంగాణ ఉద్యమ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు. అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ కవిత ఆయన భార్య పద్మావతి, కుమారుడు రాహుల్‌ను కలిశారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవిత తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.గతంలో తమ కూమార్తె ప్రియాంక వైద్య విద్య అభ్యసించడానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆర్థిక సాయం చేసిన విషయాన్ని గుర్తు చేసిన పద్మావతి చేసుకొని.. కృతజ్ఞతలు తెలిపారు. ఇదే తరహాలో భవిష్యత్తులోనూ బీఆర్ఎస్ పోలీస్ కిష్టయ్య కుటుంబానికి దన్నుగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారి కుటుంబాలను కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కవిత వెంట టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ తనోబా ఉన్నారు.

## సీనియర్లను కాదని జూనియర్లకు.. ఇష్టారాజ్యంగా నర్సింగ్ ఆఫీసర్ల డిప్యూటేషన్లు!



**హైదరాబాద్-నవభూమి:** వైద్యారోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్ల డిప్యూటేషన్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీనియార్టీని పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని నర్సింగ్ ఆఫీసర్లు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలను ప్రారంభించనున్నది. ఈ నేపథ్యంలో ఆయా కాలేజీల్లో బోధనా సిబ్బం ది కోసం 84 మంది నర్సింగ్ ఆఫీసర్లను డిప్యూటేషన్‌పై నియమిస్తూ డీఎంఈ డాక్టర్ వాణి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఎస్సీ/బీఎస్సీ నర్సింగ్ అర్హత ఆధారంగా ఈ డిప్యూటేషన్లు ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ జాబితాపై సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సీనియర్లను పక్కనబెట్టి ఎలాంటి అనుభవం లేని, కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారికి డిప్యూటేషన్లు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీగా అవకాశం ఇవ్వాలని ఎంతో మంది సీనియర్లు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని, అయినా వాటన్నింటినీ పక్కనపెట్టి కావాలనే జూనియర్లకు అవకాశం ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ డిప్యూటేషన్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. హెల్త్ సెక్రటరీ, వైద్యశాఖ మంత్రి వెంటనే స్పందించి చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రోగ్రాం నేపథ్యంలో హడావుడిగా ఇచ్చాం..**

డిప్యూటేషన్ల అంశంపై నర్సింగ్ విభా గం డీడీ విద్యుల్లతను వివరణ కోరగా.. నర్సింగ్ కాలేజీలను సీఎం ప్రారంభించే కార్యక్రమం నేపథ్యంలో హడావుడిగా ఉ త్తర్వులు జారీ చేసినట్టు చెప్పడం గమనార్హం. దవాఖానల్లో సీనియర్ల అవసరం ఉ న్నదని, అందుకే జూనియర్లకు అవకా శం ఇచ్చామని చెప్పుకొచ్చారు. డిప్యూటేషన్లు తాత్కాలికమేనని, రెండుమూడు నెలల తర్వాత పదోన్నతుల్లో భాగంగా ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు.

## అశ్లీల మాటలు.. పుట్టుమచ్చలు చూపించాలంటూ.. విద్యార్థినులతో టీచర్ అసభ్య ప్రవర్తన

**నిడమనూరు-నవభూమి:** ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు ఆదర్శ పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఉపాధ్యా యుడి వ్యవహార శైలితో విసిగిపోయిన విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలుపడంతో శనివారం వారు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు రెండు నెలల క్రితం బదిలీల్లో భాగంగా నిడమనూరు ఆదర్శ పాఠశాలకు వచ్చాడు. 6,7,8వ తరగతుల విద్యార్థులకు బోధిస్తున్నాడు. సబ్జెక్టుకు సంబంధం లేని అశ్లీల మాటలతో అనుచితంగా ప్రవర్తించడం విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

# చికెన్ ధరలకు రెక్కలు..!



**హైదరాబాద్-నవభూమి:** సాధారణంగా కార్తికమాసం ప్రారంభం కాగానే.. చికెన్ ధరలు తగ్గిపోతాయి. హిందువుల్లో చాలా మంది పూజలు, ఉపవాసాలు ఉండడం వల్ల.. మాంసాహారం వైపు వెళ్లారు. దీంతో నాన్ వేజ్ డిమాండ్ బాగా తగ్గిపోతుంది. దీంతో వాటి ధరలు అమాంతంగా పడిపోతాయి. అయితే డిసెంబర్ 01వ తేదీతో కార్తిక మాసం వెళ్లిపోతుంది.

ఇక డిసెంబర్ 02వ తేదీ పోలి స్వర్గానికి వెళ్లిన రోజు. దీంతో డిసెంబర్ 03వ తేదీ నుంచి చికెన్ ధరలకు రెక్కలు రానున్నాయి. నిన్న మొన్నటి వరకు తక్కవ ధర ఉన్న చికెన్ మరి కొన్ని గంటల నుంచి భారీగా పెరగనుంది. ప్రస్తుతం చికెన్ కిలో ధర రూ. 270గా ఉంది. డిసెంబర్ 3వ తేదీ నుంచి దీని ధర రూ.350 నుంచి రూ.400 వరకు చేరే అవకాశముంది. ఇక కోడిగుడ్ల ధర అయితే ఇప్పటికే భారీగా పెరిగింది.

ఎందుకంటే..కార్తికమాసం వెళ్లిపోయింది. మార్గశిర మాసంలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. అలాగే క్రిస్మస్ పండగ, కొత్త ఏడాది సందర్భంగా భారీగా కార్యక్రమాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో చికెన్, మటన్ బిర్యానిలకు భారీ డిమాండ్ ఏర్పడనుంది. ఇక కేకుల తయారీ ఉంటుంది. వాటి తయారీలో కోడిగుడ్లను వినియోగిస్తారు. దీంతో చికెన్, మటన్‌లతోపాటు కోడిగుడ్ల ధరలు భారీగా పెరగనున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

## సన్నీ లియోన్ కోసం ఆశగా ఎదురు చూసిన యువకులు.. చివరికి జరిగింది ఇదే..



**హైదరాబాద్-నవభూమి:** ప్రముఖ బాలీవుడ్ నటి సన్నీ లియోన్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు షాక్ ఇచ్చారు. శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని ఇల్యూజన్ పబ్‌లో ఆమె డీజే ప్లే చేస్తూ లైవ్ ఫెర్ఫార్మెన్స్ ఇవ్వాల్సి ఉండగా అందుకు పోలీసులు నిరాకరించారు. పబ్ యజమానులు సన్నీ లియోన్‌తో వీకెండ్ లైవ్ ఫెర్ఫార్మెన్స్ ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 11 గంటల నుంచి 12:30 గంటల వరకూ పబ్‌లో ఆమె సందడి చేయాల్సి ఉంది. దీనికి భారీఎత్తున రేట్లు పెట్టి మరీ ఇల్యూజన్ పబ్ యజమానులు టికెట్లు విక్రయించారు.

సన్నీ లియోన్ సైతం శనివారం రాత్రి హైదరాబాద్ నగరానికి చేరుకుంది. అయితే ఆమె వస్తుందన్న వార్త తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. సన్నీ లియోన్ పబ్‌లో నృత్యాలు చేసేందుకు అనుమతి లేదంటూ తేల్చి చెప్పారు. ఓ వైపు భారీగా టికెట్లు విక్రయించడం, తమ అభిమాన తార వస్తుందన్న సమాచారంతో యువత భారీగా పబ్ వద్దకు చేరుకోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే పబ్ యజమానులు మాత్రం అనుమతి కోసం విశ్వప్రయత్నాలు చేశారు. ఉన్నతాధికారులను సైతం కలిసి పరిష్మన్ ఇవ్వాలని కోరారు. అయితే వారి ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

మరోవైపు పబ్ వద్దకు యువకులు భారీగా రావడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమతి లేకపోయినా సన్నీ లియోన్‌ను తీసుకువస్తారేమో అనే అనుమానంతో రాత్రి ఒంట గంట వరకూ పహారా కాశారు. దీంతో అక్కడంతా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మరోవైపు ఈవెంట్ కోసం సన్నీ ఓ హోటల్‌లో ఎదురు చూస్తూ ఉంది. పోలీసులు భారీగా మోహరించడంతో చేసేదేమీ లేక పబ్ నిర్వాహకులు ప్రొగ్రామ్ క్యాన్సిల్ చేశారు. దీంతో వేల రూపాయలు వెచ్చించి టికెట్లు కొన్న యువత మొత్తం తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సన్నీ లైవ్ ఫెర్ఫార్మెన్స్ చూద్దామని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న వారి ఆశలు కాస్త అడియాశలుగా మారడంతో పబ్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భారీ ఎన్‌కౌంటర్

(1వపేజీ తరువాయి)

**పోలీసులపై పౌరహక్కుల సంఘం ఆగ్రహం..**

చెల్పాక ఎన్‌కౌంటర్‌పై పోలీసులు, రేవంత్ ప్రభుత్వంపై తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెల్పాక ఎన్‌కౌంటర్ బూటకమని ఆరోపించింది. కోవర్టుల ద్వారా అన్నంలో విషం కలిపి స్పృహకోల్పోయిన తర్వాత పోలీసులు ఎన్ కౌంటర్ చేశారని అన్నారు. తలపై కాల్చిన గాయాలు తప్పితే ఎక్కడా గాయాలు లేవు అని అన్నారు. నిపుణులైన వైద్య బృందంతో పోస్టు మార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన 12నెలల్లో 16మంది మావోయిస్టులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది.

**ఎన్‌కౌంటర్‌పై ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ప్రకటన**

తెలంగాణలో మావోయిస్టులకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ములుగు జిల్లా ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో నేటి ఉదయం జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో ఏడుగురు నక్సల్స్ మృతి చెందారు. దీనిపై ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ప్రకటన చేశారు. మావోయిస్టులు ఇటీవల వాజేడులో ఇద్దరు అమాయకులను చంపారని వెల్లడించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా జిల్లాలో గస్తీ పెంచామని చెప్పారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసు బృందానికి ఈ ఉదయం మావోయిస్టులు ఎదురుపడ్డారని, పోలీసులను చూసి వారు కాల్పులు జరిపారని ఎస్పీ శబరీశ్ వివరించారు. లొంగిపోవాలని హెచ్చరించినా కాల్పులు ఆపలేదని తెలిపారు. దాంతో, ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాల్పుల అనంతరం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు గుర్తించామని చెప్పారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుకుంటున్నామని ములుగు ఎస్పీ తెలిపారు.

# సచివాలయ సిబ్బందికి సర్కార్ షాక్!

(1వపేజీ తరువాయి)సిబ్బందికి ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రతీ నెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. తొలి రోజునే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. కాగా, ఈ రోజు ఆదివారం కావటంతో నిన్న(శనివారం) రోజునే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గతంలో వాలంటీర్లతో జరిగే పెన్షన్ల పంపిణీ కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో కొనసాగిస్తోంది. వేకువజాము నుంచే పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. షోకాజ్ నోటీసులు అయితే, నిర్దేశించిన సమయం లోగా పెన్షన్ల పంపిణీ పూర్తి చేయలేదంటూ వార్డు,గ్రామ సచివాలయాల సిబ్బందికి షో కాజ్ నోటీసులు జారీ అయ్యాయి. టార్గెట్ పూర్తి చేసినా తమకు నోటీసులు ఇవ్వటం పైన సచివాలయాల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యల కారణంగానే తాము లాగిన్ కాలేకపోయామని చెబుతున్నారు. అదే విధంగా సచివాలయాల సిబ్బంది హాజరు పైనా ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇక నుంచి ప్రతీ సచివాలయంలో సిబ్బంది వారి అటెండెన్స్ మొబైల్ యాప్‌లో సచివాలయానికి వచ్చిన సమయం, వెళ్లిన సమయం రెండూ నమోదు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. ఒకే సారి ఎంటర్ చేసినా.. ఎకేసారి ఎంట్రీ ఉన్నాఆ రోజు ఉద్యోగి సెలవుగా పరిగణిస్తామంటూ సందేశాలు అందాయి.

## ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షా

(1వపేజీ తరువాయి)కాగా, 2020 నవంబరు నుంచి ఐసీసీ చైర్మన్ గా గ్రెగ్ బార్ క్లే వ్యవహరించారు. ఇప్పుడు బార్ క్లే స్థానంలో జై షా ఐసీసీ పగ్గాలు అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యున్నత పదవిని చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని జై షా తెలిపారు. తనకు మద్దతిచ్చిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు, సభ్య దేశాల క్రికెట్ బోర్డులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.

## 9 నుంచి అసెంబ్లీ శీతాకాల

(1వపేజీ తరువాయి)ఉదయం ఒక ప్రకటన చేశారు. కులగణన వివరాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చ జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలన తనకు సంతృప్తినిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అంతేగాక సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తామని ప్రకటించారు.

## సంక్రాంతి తర్వాతే..రైతు భరోసా

(1వపేజీ తరువాయి)రేవంత్ ప్రకటించారు. రైతుభరోసాకు అడ్డు పడేందుకు అనేక మంది వస్తారని పరోక్షంగా ప్రతిపక్షాల పై విమర్శలు చేసారు. ఇక.. రైతులకు వరి సన్నాలు పండిస్తే బోనస్ చెల్లిస్తామని రేవంత్ స్పష్టం చేసారు. రైతులు పండించే సన్నాలను తెలంగాణలోని హాస్టల్స్ కే వినియోగిస్తామని వెల్లడించారు. తాము ప్రకటించిన విధంగా నిర్దిష్ట సమయంలో రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న 25 లక్షల మంది రైతులకు రుణ మాఫీ అమలు చేసామని...ఎవరికైనా మానవ తప్పిదంతో అమలు కాకుంటే వారికి అమలు చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

## పారిపోలేదు..

(1వపేజీ తరువాయి)ఎలా స్పందిస్తారనేది చూడాలి.

ఈ కేసు ఏమైనా ఎమర్జెన్సీ కేసా? ఏడాది తర్వాత ట్వీట్ చూసిన అతనికి వారంలో అన్నీ అయిపోవాలనడంలో ఏమైనా అర్థం ఉంటదా అసలు.. హత్యకేసుల్లాంటి వాటికి సంవత్సరాలు తీసుకొని.. ఇప్పుడు ఎమర్జెన్సీ కేసుల కంటే ముందే వీటిని విచారించడమేంటని తనదైన శైలిలో కౌంటర్ వేయగా.. ఇప్పటికే ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

కాగా రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. ఏజీ వచ్చి వాదనలు వినిపిస్తారని, అందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరిన మీదట న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

## నటి శోభిత ఆత్మహత్య..!

(1వపేజీ తరువాయి) అలాగే, కన్నడ సినిమాలో రెండు మూడు సినిమాల్లో చందన్, శ్వేతా పండిత్‌లతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. సినిమాలు, టీవీరంగంపై మక్కువ పెంచుకొని విద్యార్థి దశ నుంచే డ్యాన్స్‌పై మక్కు పెంచుకుంది. మొదట యాంకర్‌గా పని చేశారు. ఆ తర్వాత బుల్లితెరలో అదృష్టం పరీక్షించుకుంది. అక్కడి నుంచి సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. నటి శోభిత సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు అభిమానులకు టచ్‌లో ఉంటుంది. ఏడాది కిందట పెళ్లి చేసుకోగా.. ఆమె భర్త హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లయిన తర్వాత సినిమాలు, టీవీకి దూరమైంది. సోషల్ మీడియాలో చివరిసారిగా కన్నడ రాజ్యోత్సవం, దీపావళి సందర్భంగా అభిమానులకు శుభాకాంక్షలు తెలిపింది. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బెంగళూరుకు పార్థివ దేహాన్ని తరలించనున్నట్లు సమాచారం.

## చంద్రబాబుకు షాకిచ్చిన జేసీ

(1వపేజీ తరువాయి)తెలిపారు. చంద్రబాబు పిలుపుతో ఆదినారాయణరెడ్డి అమరావతికి వచ్చారు. జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం ఈ భేటీకి డుమ్మా కొట్టారు. చంద్ర బాబు ఎలాగూ బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణకే తన మద్దతు ప్రకటిస్తారనే ఉద్దేశంతోనే జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ సమావేశానికి దూరంగా ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. తనకు జ్వరంగా ఉందని చెప్పి జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. మరి వీరి మధ్య వివాదానికి చంద్రబాబు ముగింపు పలికారు.అక్కడ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డితో ఇదే అంశం పై మాట్లాడారు. ఈ వివాదాలు ఏంటని ప్రశ్నించారు.బూడిద తరలింపు వ్యవహారంలో ఇలా రోడ్డును పడితే పార్టీ పరువు ప్రతిష్టలు ఏం కావాలని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎవరిష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తే ఇక పార్టీ ఎందుకని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా,కార్యకర్తలకు పని కల్పించేందుకే ఇలా వ్యవహరించాల్సి వచ్చిందని అస్మిత్ రెడ్డి వివరణ ఇచ్చే ప్రయత్నం చేసారని తెలుస్తోంది. దీనికి స్పందనగా కార్యకర్తల సంగతి తాను చూసుకుంటా నని, ఇలాంటివి మాత్రం కొనసాగితే సహించేది లేదని చంద్రబాబు తేల్చి చెప్పారు. అటు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి.. ఇటు జేసీకి చంద్రబాబు క్లాస్ తీసుకోవటంతో ప్రస్తుతానికి ఆర్టీపీపీ బూడిద వ్యవహారం సర్దుమనిగింది.

# రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రను తిప్పి కొట్టాలి


- మాలల సింహగర్జన ఆత్మగౌరవ సభ విజయవంతం
- మాలల ఆత్మగౌరం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి
- మూడు వేల సంవత్సరాలుగా కుల వివక్ష దేశంలో కొనసాగుతుంది
- విశ్వరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను విమర్శిస్తే సహించేది లేదు రిజర్వేషన్లు 20 శాతం పెంచాలి
- దేశంలోనే దళితుల అభివృద్ధి కోరుకున్న వెంకటస్వామి
- పన్నులు చెల్లించి వ్యాపారాలు చేస్తుంటే దాడులు చేస్తున్నారు
- సింహ గర్జన సభ విజయవంతం అన్ని రాజకీయ పార్టీలకు చెంపపెట్టు
- కాంగ్రెస్ పార్టీ లైన్ ఎక్కడ దాటలేదు

**హైదరాబాద్ కంటోన్మెంట్ , నవభూమి ప్రతినిధి , డిసెంబర్ 1:** అగ్రకుల మనువాదులందరూ దేశంలోని రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర చేస్తున్నారని చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి ఆందోళన వ్యక్తం చేశారు . ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మాల మాల ఉపకులాల సింహ గర్జన సభకు హాజరైన లక్షలాదిమంది మాల మాల ఉపకులాల వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గత 30 సంవత్సరాలుగా ఏకపక్షంగా అబద్ధాలు చెప్పి సంఖ్యా బలం అధికంగా ఉందని , ఒక వర్గం వారే అధిక రిజర్వేషన్లు పొందుతున్నారని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ మనువాద పార్టీల చుట్టూ తిరుగుతూ విమర్శలు చేస్తున్నారని వివేక్ వెంకటస్వామి చెప్పారు . విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను విమర్శించే సహించేది లేదని హెచ్చరించారు. ఆగస్టు 1న వచ్చిన సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిల్లా తీర్పు రిజర్వేషన్లను పూర్తిగా తొలగించే విధంగా ఉందని . రాజ్యాంగం లోని 341 అధికరణ ప్రకారం చెయ్యకుండా బిజెపి ప్రభుత్వం దొడ్డి దారిన తీర్పులు చెప్పించి రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర చేస్తుందని వివరించారు. తీర్పు వచ్చిన నాటి నుండి తెలంగాణలోని మాల జాతి ప్రజలందరూ ఆందోళనకు గురై గత మూడు నెలలుగా మండల స్థాయి పట్టణస్థాయి జిల్లాస్థాయి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా సభలు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. తెలంగాణలో మాలలు కేవలం 20 శాతం ఉన్నారని 80% వేరే వర్గం ఉందని తప్పుడు ప్రచారాలు చేస్తూ నిందిస్తున్నారని ఇది ఏ రకంగా కూడా సాహేతకం కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 30 లక్షలకు పైగా మాల మాల ఉప కులాల వారు ఉన్నారని మొదటినుంచి తమది చెబుతున్నామని సింహ గర్జన సభకు స్వచ్ఛందంగా తమ తమ సొంత ఖర్చులతో తరలివచ్చి సింహ గర్జన ఆత్మగౌరవ సభను విజయవంతరానికి తరలివచ్చినందుకు చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక వెంకట్ స్వామి తెలిపారు. స్వర్గీయ గడ్డం వెంకటస్వామి కాక దళితుల అభివృద్ధి కోరుకొని ఉప కులాలతో సంబంధం లేకుండా అందరికీ సహకారాలు అందించాలని వివరించారు. హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో సుమారు 80 000 పైచిలుకు గుడిసెలను వేయించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి గుడిసెల వెంకటస్వామిగా పేరును ప్రజల నుంచి సంపాదించుకున్నారని, అలాగే రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా ఉండి యువతరాన్ని ప్రోత్సహించడంతో కాంగ్రెస్ పార్టీ లో కాకా గా పేరు పొందాలని ఆయన సేవలు ఎన్నిటికి మరిచిపోలేనివని గుర్తు చేశారు. కాకా వెంకటస్వామి వారసులుగా మాల జాతి అభివృద్ధి కోసం వారి ఆత్మ గౌరవం కోసం తాము నిరంతరం కృషి చేస్తూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మాలలు ఎవరి హక్కులను గుంజుకోలేదని మాలల సమాజంలో అందరి పక్షాన నిలబడి హక్కుల కోసం కొట్లాడిన చరిత్ర ఉందని అందరికీ అండగా నిలిచిన చరిత్ర మాలలకు ఉందని వివరించారు . తెలంగాణలో జనాభా ప్రకారం 20 శాతం రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు

ఇటీవల కొందరు మాలలు మనువాదులను అది క లబ్ది పొందారని జనాభాలో అధికంగా ఉన్నామని ఆధారాలేని ఆరోపణలు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలోని దళితుల ఆత్మగౌరవం కోసమే మాలలందరూ ముందు నిలబడి కొట్లాడిన ఘనత ఉందని చెప్పారు. అబద్ధాలను నమ్మి గుడ్డిగా మద్దతునిచ్చే రాజకీయ పార్టీలకు సింహ గర్జన ఆత్మగౌరవ సభ చెంపపెట్టు లాంటిదని ఆయన చెప్పారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు దళితుల మధ్య చిచ్చు పెట్టడం మానేసి యువతరానికి అభివృద్ధి చేయడానికి సహకరించు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నిబంధనలు ప్రకారం ఇక్కడ లైన్ దాటలేదని కానీ కొంతమంది కాంగ్రెస్ పార్టీలో తన పైన సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. గ్రామ గ్రామాల నుండి పట్టణాల నుండి తరలివచ్చిన మాల జాతి సోదరి సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి ముందు విశ్వరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గడ్డం వెంకటస్వామి, భాగ్యరెడ్డివర్మల చిత్రపడాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. సింహ గర్జన మాల ఆత్మగౌర సభలో పార్లమెంట్ సభ్యులు వాష్వాన్ , ఢిల్లీలోని ఆప్ మాజీ మంత్రి రాజేంద్ర గోపాల్, గడ్డం వినోద్, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రులు సుద్దాల దేవయ్య, డాక్టర్ జి విజయరామరావు, ప్రముఖ గాయకుడు రెంజర్ల రాజేష్, దిగంబర్ కాంబ్లే, రిజర్వేషన్ల వ్యతిరేక పోరాట సమితి నాయకులు రాజు ఉస్తా ద్ , డి సర్వయ్య , చెరుకు రామచందర్, సీనియర్ జర్నలిస్ట్ వెంకటేష్ , ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజేష్ మహాసేన , ఇతర ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనగా

శాసనసభ్యులు నాగరాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశానికి ముందు రెంజర్ల రాజేష్, గోరేటి రమేష్, కదారి రమేష్ ల ఆధ్వర్యంలోని కళాబృందం తమ గానం పాటతో సబికులను ఉర్రూతలేవించారు. సింహ గర్జన మాలల ఆత్మగౌరవ సభ ప్రశాంతంగా విజయవంతమైనందుకు వివేక స్వామి నిర్వాహకులందరికీ అభినందన తెలిపారు.





## భారత జనాభా వృద్ధిరేటుపై ఆందోళన వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్

**న్యూఢిల్లీ-నవభూమి:**భారత దేశ జనాభా వృద్ధి రేటు తగ్గుతుండడంపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంతానోత్పత్తి రేటు 2.1 శాతానికి మించి ఉండాలని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశమని.. సమాజంలో సంతానోత్పత్తి రేటు 2.1 శాతం కంటే తక్కువగా ఉంటే.. ఆ సమాజం ఎలాంటి సంక్షోభం అవసరం లేకుండానే భూమిపై మనుగడ అంతరించిపోయే అంచునకు చేరుకుంటుందని ఆధునిక జనాభా శాస్త్రం చెబుతోందన్నారు. జనాభా తగ్గడం వల్ల అనేక భాషలు, సమాజాలు ఇప్పటికే ఉనికి కోల్పోయాయన్నారు. 1998, 2002లో భారత జనాభా విధానం రూపొందిందని, 2.1 శాతానికి కంటే సంతోనోత్పత్తి పడిపోకుండా చూడాల్సిన అవసరాన్ని గుర్తించిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. సమాజం మనుగడకు ఇద్దరు, ముగ్గురి అవసరం ఉందన్న ఆయన.. ఆధునిక జనాభా శాస్త్రం చెబుతున్నది కూడా ఇదే చెబుతుందన్నారు. ఈ సంఖ్య చాలా కీలకమని లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయన్నారు. జనాభా వృద్ధి రేటు తగ్గుముఖం పట్టడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. ఇదిలా ఉండగా.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వస్తున్నది. 1950 సంవత్సరంలో ఫెర్టిలిటీ రేటు 6.2శాతం కంటే ఎక్కువ ఉండగా.. ప్రస్తుతం అది 2.1శాతానికి తగ్గింది. ఇలా కొనసాగితే 2050 నాటికి సంతానోత్పత్తి రేటు 1.3కి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ | సోమవారం | 02 ၊ డిసెంబర్ ၊ 2024

# దొంగ బెయిల్‌తో జైలు నుంచి జంప్!



**హైదరాబాద్-నవభూమి:** మోసం చేయటం డీఎన్ఏగా మార్చుకున్న ఒక నేరస్తుడి బరితెగింపు తెలంగాణ జైళ్ల శాఖలో సీరియస్ చర్చగా మారింది. అదే సమయంలో జైళ్లను ఇలా కూడా బురిడీ కొట్టొచ్చా? అన్నదిప్పుడు హాట్ టాపిక్ గా మారింది. జైల్లో ఉన్న ఒక నిందితుడు..తనకు గతంలో మరో కేసులో వచ్చిన బెయిల్ పేపర్ ను ట్యాంపరింగ్ చేసి.. సరికొత్త బెయిల్ గా బిల్డప్ ఇచ్చి దర్జాగా జైలు నుంచి విడుదలైన వైనం.. నోట మాట రానివ్వని రీతిలో మారింది. అదే సమయంలో జైల్లోని లోపాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. సంచలనంగా మారిన ఈ ఉదంతంలోకి వెళితే.. హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన మీర్ సుజాత్ అలీఖాన్‌పై పలు కేసులు ఉన్నాయి. చీటింగ్ కేసులో అతను కొద్ది నెలల క్రితం చంచలగూడ జైలుకు వెళ్లాడు. ఆ సందర్భంగా అతనికి అండర్ ట్రయల్ ఖైదీగా 5549 నెంబరును కేటాయించారు. ఈ కేసుకు సంబంధించి అక్టోబరు 17న బెయిల్ మీద బయటకు విడుదలయ్యాడు. కట్ చేస్తే.. నవంబరు 2న నార్సింగ్ పోలీస్ స్టేషన్ లో అతనిపై మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదైంది. దీంతో అతడ్ని అరెస్టు చేసిన పోలీసులు చంచలగూడ జైలుకు తరలించారు. ఈసారి అంతనికి అండర్ ట్రయల్ ఖైదీగా 6687 నెంబరును కేటాయించారు. అయితే.. చంచలగూడ జైల్లో బెయిల్ మంజూరు చేసే శాఖలో పని చేసే మరో నిందితుడు రాముతో లోగుట్టు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. సాధారణంగా జైలు నిబంధనల ప్రకారం కొన్నిపనులు మినహా ఖైదీల చేత పని చేయించకూడదు. కానీ.. చంచలగూడ జైల్లో మాత్రం బెయిల్ విభాగంలో దొంగతనం కేసులో అరెస్టు అయిన విచారణ ఖైదీకి బాధ్యతలు అప్పగించటం షాకింగ్ గా మారింది. దీంతో.. రాముతో ఒప్పందం చేసుకునన సుజ్జాత్ తనకు గతంలో ఇచ్చిన బెయిల్ కాపీని.. మార్ఫింగ్ చేసి సరికొత్త బెయిల్ గా పత్రాన్ని సిద్ధం చేశాడు. తన వారి చేత చంచలగూడ జైలుకు ఆ పత్రాలు వచ్చేలా చేశాడు. వాటిని చూసిన విచారణ ఖైదీ.. అంతా బాగుందంటూ స్టాంప్ వేశాడు. అనంతరం ఇలాంటి వాటిని చెక్ చేయాల్సిన సిబ్బంది రోటీన్ చెకింగ్ చేసి.. అతడికి కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లుగా భావించి.. అతడ్నివిడుదల చేశారు. ఈ పాపం ఎలా బయటకు వచ్చిందన్న విషయంలోకి వెళితే.. సుజ్జాన్ మీద మరో పోలీస్ స్టేషన్ లో ఇంకో కేసు నమోదైంది. దీనికి సంబంధించిన విచారణ కోసం కోర్టు నుంచి పిటీ వారెంట్ తీసుకున్నారు. ఎవరైనా నిందితుడికి బెయిల్ మంజూరు చేసిన తర్వాత పీటీ వారెంట్ ఇష్యూ కాదు. పీటీ వారెంట్ తో జైలుకు వచ్చిన పోలీసులతో ఉలిక్కిపడ్డ చంచలగూడ జైలు అధికారులు.. దొంగబెయిల్ పత్రాలతో విడుదలైనట్లుగా గుర్తించారు. దీంతో.. ఈ అంశం జైళ్లశాఖలో సంచలనంగా మారింది. ఒక దొంగ.. దొంగ బెయిల్ తో జైలు అధికారులకే మస్కా కొట్టేసిన వైనం ఇప్పుడు షాకిచ్చేలా మారింది. దీంతో.. అతడిపై మరో కేసు నమోదు చేసిన పోలీసులు.. అతడ్ని అదుపులోకి తీసుకునేందుకు వెతుకుతున్నారు.

## అత్తవారింట్లో స్నానం చేస్తుండగా.. గీజర్ పేలి నవ వధువు మృతి



**లక్నో-నవభూమి:** అత్తవారింట్లోని బాత్‌రూ మ్‌లో నవ వధువు స్నానం చేస్తుండగా గీజర్ పేలింది. ఈ సంఘటనలో ఆమె మరణించింది. దీంతో వరుడు, అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భోజీపురాలోని పిపల్సనా చౌదరి గ్రామానికి చెందిన దీపక్ యాదవ్‌కు బులంద్‌షహర్‌లోని కాలే కా నాగ్లా గ్రామానికి చెందిన దామినీతో ఐదు రోజుల కిందట వివాహం జరిగింది. నవ వధువైన ఆమె అత్తవారింటికి వచ్చింది.కాగా, నవంబర్ 27న అత్తవారింట్లోని బాత్‌రూమ్‌లో దామినీ స్నానం చేస్తుండగా గీజర్ పేలింది. విష వాయువుల వల్ల లోపల అచేతనంగా పడిపోయింది. భర్త దీపక్ యాదవ్, అత్తమామలు ఎంత పిలిచినా ఆమె బాత్‌రూమ్ నుంచి బయటకు రాలేదు.మరోవైపు ఆందోళన చెందిన అత్తింటి వారు బాత్‌రూమ్ డోర్ పగులగొట్టారు. లోనికి వెళ్లి చూడగా గీజర్ పేలడాన్ని గమనించారు. అచేతనంగా నేలపై పడి ఉన్న దామినీని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పెళ్లైన ఐదు రోజులకే మరణించిన నవ వధువు దామినీ మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత ఆమె మరణానికి కారణాలు తెలుస్తాయని పోలీస్ అధికారి తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బలమైన గాలుల మధ్య.. ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్‌కు విమానం యత్నం



**చెన్నై- నవభూమి:** ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో ఈదురు గాలులు బలంగా వీచాయి. ఈ వాతావరణ పరిస్థితుల్లో ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండింగ్ కోసం ఒక విమానం ప్రయత్నించింది. అయితే బలమైన గాలుల వల్ల ఆ విమానం బాగా ఊగిపో యింది. దీంతో పైలట్ ఆ విమానాన్ని తిరిగి గాల్లోకి తీసుకెళ్లాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నవంబర్ 30న ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఈ 683 విమానం ముంబై నుంచి చెన్నై చేరుకున్నది. ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో చెన్నైలో బలంగా గాలులు వీచాయి. దీంతో విమానం ల్యాండింగ్ కోసం పైలట్ చాలా కష్టపడాల్సి వచ్చింది.కాగా, ఆ ఇండిగో విమానం ల్యాండింగ్ కోసం ప్రయత్నించింది. అయితే బలమైన గాలుల వల్ల అది అటూ ఇటూ ఊగిపోయింది. విమానం రన్‌వేను తాకనుండగా పైలట్ వెంటనే దానిని గాల్లోకి తీసుకెళ్లాడు. ఆ ఎయిర్‌పోర్ట్ చుట్టూ ఒక రౌండ్ తిరిగిన తర్వాత ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు.మరోవైపు ఇండిగో సంస్థ ఈ సంఘటనను ధృవీకరించింది. భారీ వర్షం, ఈదురు గాలులు వంటి ప్రతికూల వాతావరణాన్ని ఆ విమానం ఎదుర్కొన్నట్లు తెలిపింది. అందువల్ల భద్రతా ప్రోటోకాల్‌కు అనుగుణంగా గో రౌండ్ కోసం అది గాల్లోకి వెళ్లినట్లు పేర్కొంది. సాధారణంగా విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేయలేనప్పుడు ఇలా జరుగుతుందని వివరించింది. అయితే ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు తమ పైలట్‌లు సరైన శిక్షణ పొందినట్లు ఇండిగో సంస్థ స్పష్టం చేసింది.కాగా, ఈ సంఘటన తర్వాత ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో 16 గంటల వరకు చెన్నై విమానాశ్రయాన్ని మూసివేశారు. మరోవైపు బలమైన గాలుల మధ్య ఇండిగో విమానం ల్యాండింగ్‌కు ప్రయత్నించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## వాయనాడ్‌లో ప్రియాంకాగాంధీ రోడ్ షో..



**చెన్నై- నవభూమి:** కేరళ లోని వాయనాడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్య దర్శి ప్రియాంకాగాంధీ వాద్రా రోడ్ షో నిర్వహించారు. వాయనాడ్‌లోని మనంతవాడిలో రోడ్ షో జరిగింది. ఈ రోడ్ షోకు జనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రియాంకాగాంధీ ఓపన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.
రోడ్ షో అనంతరం మనంతవాడిలో నిర్వహించిన బహిరంగసభలో ప్రియాంకాగాంధీ మాట్లాడారు. తనను ఎంపీగా గెలిపించిన వాయనాడ్ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. వాయనాడ్ ప్రజలు తనపై చూపించిన ప్రేమ, అభిమానాలను ఎప్పటికీ మరువలేనని చెప్పారు. తన గెలుపు కోసం యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ కార్యకర్తలు చాలా కష్టపడి పనిచేశారని అన్నారు.

## పెళ్లికి హాజరైన బృందం.. మద్యం సేవించడంతో 40 మంది అరెస్ట్

**పాట్నా- నవభూమి:** కొందరు వ్యక్తులు పెళ్లికి హాజరయ్యారు. మద్యం సేవించి డ్యాన్సులు చేశారు. అయితే ఆ రాష్ట్రంలో మద్యంపై నిషేధం ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లిలో మద్యం సేవించిన సుమారు 40 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పెళ్లికుమారుడితో కలిసి పెళ్లి బృందం ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు చేరుకున్నది. అయితే పెళ్లి ఊరేగింపులో పాల్గొన్న సుమారు 40 మంది వ్యక్తులు మద్యం సేవించారు. కొందరు నాగిని డ్యాన్సు చేశారు. పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చే తమ బంధువుల కోసం మద్యం బాటిల్స్ తీసుకువచ్చారు.కాగా, బీహార్‌లో మద్యంపై నిషేధం అమలులో ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లి బృందం మద్యం సేవించినట్లు పోలీసులకు తెలిసింది. దీంతో వరుడి తరుపు వారైన 40 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారికి మద్యం అమ్మిన ఏడుగురు లిక్కర్ వ్యాపారులను కూడా అరెస్ట్ చేశారు. మద్యం బాటిల్స్‌తో పాటు రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## సుప్రీం రిటైర్డ్ సీజేఐ డీవై చంద్రచూడ్‌పై సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**సుప్రీం కోర్టు రిటైర్డ్ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌పై శివసేన నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి వారం రోజులు దాటినా మహారాష్ట్ర సీఎం పేరును ఇప్పటికీ ప్రకటించలేదు. అయితే, రాష్ట్రంలోని పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన గవర్నర్‌కు సూచించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. ఎన్నికలు ఎలా జరిగాయి.. ఈవీఎంలను ఎలా అడ్డుకున్నది తెలుసునన్నారు. ఈవీఎంలపై జాతీయ ఉద్య మాన్ని చేపడుతామన్నారు.
ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కారణంగానే షిండే ప్రభుత్వం అధికారంలో కొనసాగిందని ఆయన ధ్వజమెత్తారు. మహారాష్ట్రలో ఆపద్ధర్మ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధమని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మద్దతు లభించిందని, దీనికంతటికీ అప్పటి సీజేఐ చంద్రచూడ్ బాధ్యత వహించాలన్నారు. శివసేన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన కేసులో విచారణను మాజీ సీజేఐ ఆలస్యం చేశారని సంజయ్ రౌత్ విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటమికి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ని తొలిసారిగా సంజయ్ రౌత్ తప్పుపట్టడమే కాదు.. గతంలోనే ఇలాంటి ఆరోపణలనే చేశారు. మహారాష్ట్రకు జరిగిన నష్టానికి డీవై చంద్రచూడ్‌దే బాధ్యత అని.. ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై సరైన సమయంలో నిర్ణయం తీసుకోలేదన్నారు.జస్టిస్ చంద్రచూడ్ తన నిర్ణయాన్ని సకాలంలో ఇచ్చి ఉంటే.. భవిష్యత్తులో నేతలెవరూ పార్టీపై తిరుగుబాటు చేసేందుకు సాహసం చేసేవారు కాదన్నారు. జస్టిస్ చంద్రచూడ్‌ను చరిత్ర క్షమించదు. మహారాష్ట్ర గుర్తుంచుకుంటుందన్నారు. 40 మంది ఎమ్మెల్యేలు ఎన్నికైన పార్టీని మోసం చేసి అధికారంలోకి వచ్చారని.. సుప్రీంకోర్టు సకాలంలో నిర్ణయాన్ని వెలువరచకుండా ఓ విధంగా తలుపులు తెరిచారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగవచ్చుని.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత జస్టిస్ చంద్రచూడ్‌పై ఉందంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి పది రోజులు అవుతున్నా బీజేపీ ఇంకా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిందని ప్రశ్నించారు. మెజారిటీ ఉన్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు.

## సవతి కూతురుపై అఘాయిత్యం... 141 ఏళ్ల జైలు శిక్ష!



**న్యూఢిల్లీ-నవభూమి:**మనిషిలో మానవత్వం పాళ్లు విడతల వారీగా తగ్గిపోతున్నాయనే చర్చ గత కొంతకాలంగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. మనిషి మృగంగా మారుతున్న దశ ఇప్పటికే వచ్చేసిందనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తుంది. వావి వరసలు మరిచిపోయి, పసి పిల్లల దగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకూ మృగాళ్ల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో... సవతి కూతురిపై అత్యాచారానికి ఒడిగట్టాడు ఓ మృగాడు. తన తల్లి ఇంట్లో లేని సమయంలో తన మైనర్ సవతి కుమార్తెపై కన్నేశాడో వ్యక్తి. ఈ క్రమంలో ఆమెపై పదే పదే అత్యాచారం చేశాడు. ఈ ఘటన కేరళలో జరిగింది. ఈ వ్యవహారంపై కోర్టు తీరుపు ఇస్తూ... సదరు నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 141 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. మంజేరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఫోక్సో చట్టం, ఐపీసీ, జువైనెల్ జస్టిస్ చట్టం కింద వివిధ నేరాలకు గానూ దోషి ఏక కాలంలో ఈ శిక్ష అనుభవించలని జడ్జి జస్టిస్ అస్రాఫ్ నవంబర్ 29వ తేదీన తీర్పు వెలువరించారు. అయితే.. దోషి 40 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతడికి విధించిన శిక్షల్లో ఇదే అత్యధికమని ఆయన ఆ తీర్పులో పేర్కొన్నారు. ఇదే సమయంలో... బాధితురాలికి పరిహారంగా రూ.7.85 లక్షలు చెల్లించాలని కూడా దోషిని ఆదేశించారు. బాలికపై ఆమె తల్లి ఇంట్లో లేని సమయాల్లో 2017 నుంచి సవతి తండ్రి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. స్నేహితుడి సలహా మేరకు బాలిక చివరకు తన తల్లికి చెప్పిందని.. దీంతో వ్యవహారం వెలుగులోకి వచిందని పేర్కొన్నారు.

## కూటమికి సవాల్ విసురుతున్న 'యాసిడ్' ..!



**న్యూఢిల్లీ-నవభూమి:**రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం, గంజాయి సాగు, రవాణా వంటివాటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇది మంచి పరిణామమే. సాగు కట్టడి జరిగితే తప్ప.. లక్ష్య సాధణ సాధ్యం కాదు. ఏజెన్సీలో పెద్ద ఎత్తున సాగవుతున్న గంజాయిని అరికట్టేందుకు.. డ్రోన్ల ద్వారా కూడా ప్రయత్నిస్తు న్నారు. ఇక్, రవాణా విషయంలో అడ్డుకట్ట వేసేందుకు ఎక్కడికక్కడ నిఘా వ్యవస్థను ముమ్మరం చేస్తున్నారు. మొత్తంగా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక, ఇప్పుడు ఈగల్ పేరుతో సరికొత్త వ్యవస్థను కూడా రంగంలోకి తీసుకువచ్చింది. ఈ పరిణామాలపై మేధావులు సైతం ముగ్దులు అవుతున్నారు. కానీ, ఇంతలోనే పులిమీద పుట్ర మాదిరిగా.. యాసిడ్‌ఘటనలు కూటమికి సవాల్‌గా మారాయి. శనివారం ఒక్కరోజే మూడు ఘటనలు జరగడం.. ఈ మూడు ఘటనలకు యాసిడ్‌తో సంబంధాలు ఉండడంతో సర్కారు కలవరపడుతోంది. కక్షలు, ప్రేమ విఫలాలు వంటివి ఈ ఘటనల వెనుక ఉన్నా.. సర్కారుకు ఇబ్బందిగానే మారింది. వాస్తవానికి యాసిడ్ ఘటనలు 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో తరచుగా చోటు చేసుకునేవి. అప్పట్లో యాసిడ్ విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అంతేకాదు.. కొనుగోలు చేసేవారి వివరాల ను కూడా చాలా పెద్ద ఎత్తున నమోదు చేసుకునేవారు. దీంతో అప్పటి నుంచి నిన్న మొన్నటి వరకు కూ డా.. యాసిడ్ దాడులకు అవకాశం లేకుండా పోయింది. కానీ, ఇప్పుడు అనూహ్యంగా యాసిడ్ ఘటనలో చోటు చేసుకోవడంతో సర్కారు ఉలిక్కి పడుతోంది. %ూశ్రీంశీ =ఝు% - ద్వారంపూడి ఒక్క మగాడేనా ? ఈ ఘటనల ద్వారా.. అనేక అంశాలపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా శాంతి భద్రతల అంశంపై ప్రబా వం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇప్పుడు చంద్రబాబుకు మరింతగా పని పెరిగిందనే చెప్పాలి. ఉన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సర్కారు ఒకవైపు ప్రయత్నిస్తుంటే.. మరోవైపు ఇలా యాసిడ్ దాడులు చోటు చేసుకోవడంతో చంద్రబాబు ఫీలవుతున్నారు. అయితే.. వీటి వెనుక ఎవరి ప్రోత్సాహం లేకపోవడం ఒక్కటే ఆశాజనకం. వీటిని ఎలా కట్టడి చేయాలన్న విషయంపై సీఎం సోమవారం రివ్యూ పెట్టడం గమనార్హం.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు: అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం తమ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోదని అన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. ఢిల్లీలో తాము ఏ పార్టీతో ఎలాంటి పొత్తు పెట్టుకోబోమని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు.కాగా, తనపై స్పిరిట్‌తో దాడి చేయడంపై అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దేశ రాజధానిలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై మండిపడ్డారు. 'నేను (లా అండ్ ఆర్డర్) సమస్యను లేవనెత్తిన తర్వాత అమిత్ షా ఏదైనా చర్య తీసుకుంటారని ఊహించా. కానీ, దానికి బదులుగా పాదయాత్రలో నాపై దాడి జరిగింది. నాపై లిక్విడ్ విసిరారు. నాకు హాని జరుగలేదు. అయితే అది హాని కలిగించేదే' అని అన్నారు.మరోవైపు ప్రజా భద్రత, నేర సమస్యలను మాత్రమే తాము లేవనెత్తామని కేజ్రీవాల్ తెలిపారు. 'మీకు వీలైతే, గ్యాంగ్‌స్టర్‌లను అరెస్టు చేయండి. దానికి బదులుగా మమ్మల్ని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు?' అని ప్రశ్నించారు.

## అంతు చిక్కని 'మహాయుతి' నాడి..
## పదవుల పంపకంపై కూటమిలో విభేదాలు!

**ముంబై - నవభూమి:** మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి పదవుల పంపకంలో ఓ నిర్ణయానికి రాలేకపోతున్నది. ఉప ముఖ్యమంత్రికే హోం శాఖను ఇవ్వాలని శివసేన పట్టుబడుతున్నది. తమ నేత షిండేను పక్కనబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడుతున్నది. ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ మాత్రం బీజేపీకే ముఖ్యమంత్రి పదవి అని, ఎన్సీపీ, శివసేనలకు ఉప ముఖ్యమంత్రి పదవులు అని స్పష్టం చేశారు. అదే సమయంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైందని బీజేపీ ప్రకటించింది. మరోవైపు మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మొత్తానికి మహాయుతి రాజకీయాలు అంతు చిక్కకుండా ఉన్నాయి.
శివసేన(షిండే వర్గం) నేత సంజయ్ శిర్సట్ శనివారం మాట్లాడుతూ..ఉప ముఖ్యమంత్రికే హోం మంత్రి పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే హోం మంత్రి పదవిని నిర్వహించడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు చాలా కాలం నుంచి అమల్లో ఉన్నప్పటికీ, వాటికి షిండే కొత్త ఊపును తెచ్చారని, అందుకే ఎన్నికల్లో కూటమి పక్షాలకు సత్ఫలితాలు లభించాయని చెప్పారు. మరో రెండున్నరేండ్లు ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే, మరింత ఎక్కువ కృషి చేసి ఉండేవారన్నారు. అటువంటి షిండేను పక్కన బెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మరాఠా కోటా ఉద్యమకారులకు నచ్చ చెప్పే బాధ్యతను షిండే తన భుజస్కంధాలపై వేసుకున్నారని చెప్పారు. ఆయన మరాఠా రిజర్వేషన్ కూడా ఇచ్చారని, అందుకే ఆయనకు మద్దతు పెరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి మాఝీ లడ్కి బహిన్ పథకం ప్రభావం ఎన్నికల్లో మహాయుతిపై స్పష్టంగా కనిపించిందన్నారు.సంజయ్ శుక్రవారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పేరును బీజేపీ అధిష్ఠానం శుక్రవారం అర్ధరాత్రికి ప్రకటిస్తుందనే సమాచారం ఉందన్నారు. ఆ తర్వాతి 24 గంటల్లో ఏక్‌నాథ్ షిండే చాలా పెద్ద నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మరోవైపు మహాయుతి 2.0 ప్రభుత్వం గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తుందని మహారాష్ట్ర బీజేపీ శాఖ చీఫ్ చంద్రశేఖర్ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**శివసేన, ఎన్సీపీలకు డిప్యూటీ సీఎం పోస్టులు**

ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్‌కు కొంత వరకు తెరదించారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి బీజేపీకేనని స్పష్టం చేశారు. మహాయుతిలోని శివసేన, ఎన్సీపీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు వస్తాయని చెప్పారు.

సీఎం రేసులో ముందంజలో ఫడ్నవీస్

బీజేపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఆయన రెండుసార్లు ముఖ్యమంత్రిగా, గత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు.

**ఏక్‌నాథ్ షిండేకు అస్వస్థత**

మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన(షిండే వర్గం) చీఫ్ ఏక్‌నాథ్ షిండే అస్వస్థతతో బాధ పడుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సతారా సివిల్ సర్జన్ యువరాజ్ కార్పే మాట్లాడుతూ, షిండే శ్వాసనాళం ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారని తెలిపారు. ఆయనకు నీరసం, జ్వరం, గొంతులో దురద ఉన్నట్లు చెప్పారు. పల్స్ రేటు, బీపీ సాధారణంగా ఉన్నాయన్నారు. నీరసంగా ఉన్నందువల్ల రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

**విచ్ఛిన్నం దిశగా!:**మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యమంత్రి పదవిని దేవేంద్ర ఫడ్నవీస్‌కు కట్టబెట్టడాన్ని ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, సీఎం పదవిని ఇవ్వకపోయినా, శాంతి భద్రతలతో సహా హోం శాఖను పూర్తిగా తమకే ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారని చెప్తున్నారు. దీనికి బీజేపీ పెద్దలు ససేమిరా అనడంతో ఆయన అలిగి, అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని, సొంతూరుకు వెళ్లిపోయారని అంటున్నారు. మహాయుతితో తెగదెంపులు చేసుకోవాలని శివసేన నేతలు ఆయనకు సలహా ఇస్తున్నట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది.

## తీరం దాటిన ఫెంగల్ తుఫాన్.. 16 గంటల తర్వాత తెరచుకున్న చెన్నై ఎయిర్‌పోర్ట్

**చెన్నై- నవభూమి:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ తీరం దాటింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి మధ్య మహాబలిపురం-కారైకాల్ వద్ద తీరం దాటినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ క్రమంగా బలహీన పడుతుందని, దీంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరిపై తుఫాను విరుచుకుపడింది. భారీ వర్షాలు, వరదలతో ఇరు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తమిళనాడులో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో చెన్నై సహా పలు జిల్లాల్లో రాకపోకలు స్తంభించాయి.గత 34 గంటల్లో చాలా ప్రాంతాల్లో 20 సెంటీ మీటర్ల నుంచి 27 సెంటీ మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది. చెన్నై నగరవ్యాప్తంగా 134 ప్రాంతాలు నీట మునిగినట్లు అధికారుల అంచనా వేశారు. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం, కుండపోత వర్షాలతో సహాయక చర్యల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్ సోమవారం 02 । డిసెంబర్ । 2024



## ఈసీ.. మోదీ ఇంటి ముందు కుక్క

న్యూఢిల్లీ/పుణె-నవభూమి: ఎన్నికల కమిషన్ (ఈసీ)పై మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, శాసనమండలిలో ఆ పార్టీ ఉప నేత భాయ్ జగ్‌తప్ శుక్రవారం తీవ్ర విమర్శ చేశారు. 'ఈసీ.. ప్రధాని మోదీ ఇంటి ముందు కూర్చున్న కుక్క' అని వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి నెలకొల్పిన వ్యవస్థలన్నీ మోదీ ప్రభావంతో కీలుబొమ్మలుగా మారాయి.




మహారాష్ట్ర ప్రజలు బీజేపీ-శివసేన-ఎన్‌సీపీలతో కూడిన మహాయుతి సర్కారుకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. అయితే ఈవీఎంల ట్యాంపరింగ్‌తో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వేరుగా వచ్చాయి' అని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ఈసీ పరువుకు భంగం కలిగించే విధంగా మాట్లాడారని కేంద్ర మంత్రి సింధియా మండిపడ్డారు. మహారాష్ట్ర బీజేపీ జగ్‌తప్‌పై ఈసీకి, ముంబై పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసింది. తన వ్యాఖ్యలపై పెద్దఎత్తున దుమారం రేగుతున్నా.. క్షమాపణ చెప్పేందుకు ఆయన నిరాకరించారు. మరోవైపు, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న కాంగ్రెస్ ఆరోపణలను ఎన్నికల కమిషన్ (ఈసీ) ఖండించింది. వాటిలో వాస్తవం లేదని స్పష్టంచేసింది. ఆ పార్టీ లేవనెత్తిన అంశాలపై మంగళవారం (3న) చర్చలకు ఆహ్వానించింది.

## ఆ ధనరాశులు ఎక్కడివి?

'సోలార్' కరెంటుని సప్లై చేసే కాంట్రాక్టుల కోసం, అదానీ అనే ఒక పెద్ద పెట్టుబడిదారుడు, దేశంలోని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ పెద్దలకు దాదాపు రెండు వేల కోట్ల రూపాయల లంచాలిచ్చాడని, వారం కిందట పత్రికలూ, టీవీలూ సరికొత్త వార్తలిచ్చాయి! 'అదానీ లంచాల కహానీ' అనీ, 'లంచాల అవదానీ' అనీ, సరదా శీర్షికలు పెట్టి మరీ! లంచాల వార్తల వెనక ఒక పెద్ద కథ వుంది! అదేమిటంటే, సూర్యుడి వల్ల వచ్చే ఎండ వేడినించీ కరెంటుని(సోలార్ ఎనర్జీని) తయారు చేయించడం కోసం, అదానీ కంపెనీ, ప్రపంచ వ్యాప్తంగా, 6 వేల, 3 వందల కోట్ల పెట్టుబడులు సేకరించిందట! వాటిల్లో 15 వందల కోట్లని అమెరికాలోని బ్యాంకుల నించీ, అక్కడి ఇతర ఆర్థిక సంస్థల నించీ కూడా! అలా అమెరికా నించీ నిధులు సేకరించిన స్వదేశీ, విదేశీ కంపెనీలు ఏవైనా, తమ వ్యాపార ప్రయోజనాల కోసం, ఏ దేశంలో అయినా, ప్రభుత్వనేతలకు గానీ, అధికారులకు గానీ, లంచాలుగా ఇచ్చినా, ఇస్తానని ఆశజూపినా, అది అమెరికాలో ఒక చట్టం ప్రకారం పెద్ద నేరం అట! అందుకే, అదానీ కంపెనీ మీద అమెరికా కేసులు పెట్టింది. అదానీ నేరం కొన్ని సంవత్సరాల క్రితమే జరిగినా, అదానీ మీద వున్న అమెరికా కేసుల వివరాలు మొన్నీ మధ్యే బయటపడడంతో, భారతదేశంలో ప్రతిపక్షాలు, అదానీ మీద, కేంద్ర ప్రభుత్వం, అరెస్టుతో సహా, చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తున్నాయి. అదానీ, మోదీకి అత్యంత సన్నిహిత పెట్టుబడిదారీ మిత్రుడు కాబట్టి, అతని మీద ప్రభుత్వం చర్యలు తీసుకోదని ప్రతిపక్షాలకు గట్టి అనుమానాలు!

అదానీ ఇచ్చిన లంచాల వ్యవహారం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ వున్న కాలంలో జరిగిందట! 'జగన్‌కి 1750 కోట్లు' లంచంగా ముట్టిందట! ఏది ఏమైనా, ఆ లంచాలు ఎవరు ఎవరికి ఇచ్చారో, ఎంత ఇచ్చారో, నోట్ల రూపంలో ఇచ్చారా, బంగారు నాణాల రూపంలో ఇచ్చారా, బహుమతుల రూపంలోనా, ఏ రూపాల్లో ఇచ్చారోబీ ఆ లంచాలు తీసుకున్న వాళ్ళు వాటిని ఎక్కడ ఎలా దాచుకున్నారో- ఆ వివరాలన్నీ మనకి అనవసరం. 'మనకి' అంటే, 'శ్రామిక ప్రజలకు' అని. శ్రామిక ప్రజలు అంటే, రకరకాల స్థాయిల్లో, ఇటూ, అటూ, మేధా శ్రమలూ, శారీరక శ్రమలూ చేసేవారు అనే కదా? ఆ లంచాలు ఇవ్వడానికి, వేల కోట్ల ధనరాసులు, ఆ లంచాలిచ్చే వ్యక్తికి ఎలా వచ్చాయి, ఎక్కణ్ణించీ వచ్చాయి అన్నదే మనకి ముఖ్యంగా రావలిసిన ప్రశ్న! అయితే, దీనికి సాధారణంగా మనలోనే కొందరు చెప్పుకునేది ఏమిటంటే: 'ఏముందీ, అదానీకి, అతడి పెట్టుబడుల వల్ల లాభాలు వస్తాయి కాబట్టి, ఆ లాభాల నించే, కొంత ఇస్తాడు' -అని! కానీ, మనకి అసలు తెలియవలిసింది, లంచాల డబ్బు గురించి కాదు, 'లాభాల' డబ్బు గురించే! అయినా, లాభం రావడం చాలా సహజమైన విషయం అయినట్టే, పెట్టుబడికి వడ్డీ లాభాలు రావా, రావొద్దా- అని, ప్రపంచ జనం, ఆర్థికవేత్తలతో సహా అందరూ అనేస్తారు, భావిస్తారు! లాభానికి వున్న మూల కారణం గురించి, దాని రహస్యం గురించి 160 ఏళ్ళ క్రితం, మార్క్సు వచ్చి చెప్పేవరకూ ఎవరికీ సరిగా తెలీనే తెలీదు. ఈ సోలార్ కరెంటు పరిశ్రమనే ఉదాహరణగా తీసుకుని, ఆ రహస్యం ఏమిటో తెలుసుకో గలం, మార్క్సుని చదివి.ఏ పరిశ్రమలో అయినా, అది ఒక్క నిమిషం నడవాలన్నా, దానికి 2 అంశాలు కావాలి! సోలార్ పరిశ్రమకీ అలాగే, 2 అంశాలే! (1) కరెంటుని తయారు చేయడానికి మొట్టమొదట కావలిసిన 'సాధనాలు'. ఆ సాధనాలకి ఏవో పేర్లు వుంటాయి. సోలార్ పానల్సూ, మిరర్సూ, ఇన్వర్టర్లూ, వైర్లూ, గ్రిడ్లూ, మీటర్లూ, బ్యాటరీలూ, వగైరా వగైరాలు. ఆ సాంకేతిక వివరాలు దేనికైనా వుంటాయి. అవి అనవసరం. 'ప్రారంభ పదార్థం' ఇక్కడ సూర్యుడి నించీ వచ్చే ఎండే! ఎండ బాగాపడే అనేక ఎకరాల, విశాలమైన భూమి కూడా సహజ సాధనంగా కావల్సిందే ఇక్కడ. (2) ఆ సాంకేతిక సాధనాలతో సోలార్ కరెంటుని తయారు చేసి, దాన్ని నిల్వచేసి, దాన్ని పంపిణీ కూడా చేయడానికి ఎంతోమంది ఇంజినీర్లూ, రకరకాల టెక్నీషియన్లూ, నైపుణ్యం గల కార్మికులూ, సాధారణ శ్రమల కార్మికులూ కూడా ఎందరో కావాలి. వాళ్ళకి జీతాలు ఇస్తేనే, వాళ్ళకి పోషణ కదా? కాబట్టి, మొదట సాధనాలకు అయ్యే ఖర్చూ, తర్వాత శ్రామికులకు ఇచ్చే జీతాల ఖర్చూ- ఈ 2 ఖర్చులే 'పెట్టుబడి' అవుతాయి. ఈ పెట్టుబడి, ఎంత వుండాలో, జరగవలిసిన పనినిబట్టే కదా? ఎంత భూమిలో, ఎన్ని సాధనాలతో, ఎంత మంది కార్మికులతో, ఎంత 'సోలార్ కరెంటుని' తయారు చేయించాలనుకుంటారో, దానిని బట్టి ఎంత డబ్బు కావాలో వుంటుంది.ఉదాహరణకి, బాగా ఎండలు వుండే రాజస్తాన్‌లో, 14 వేల ఎకరాల్లో, సోలార్ పరిశ్రమ పెట్టాలంటే, 50 వేల కోట్లు అవుతుందని ఒక లెక్క-అట! ఆ లెక్కల వివరాల గందరగోళంలోకి మనం, ఇంతకన్నా వెళ్ళొద్దు. ఎందుకంటే, ఎవరు ఎంత పెట్టుబడిని పోగుచేసుకోగలిగితే, దాన్ని బట్టి పరిశ్రమని చిన్నదో, పెద్దదో పెట్టుకుంటారు.ఇక్కడ మన ప్రశ్న: లంచాల్ని ఐదో, పదో కాకుండా, కోట్లలో ఇవ్వాలంటే, వాళ్ళు భారీ పరిశ్రమ పెట్టాలి. దానికి భారీ పెట్టుబడి డబ్బు కావాలి కదా? ఈ గోలంతా ఎందుకంటే, ఏ పరిశ్రమకి అయినా, చివరికి లాభం ఎలా వస్తుందో తెలియడానికి. లాభం గురించి తెలిస్తే, లంచం గురించి తెలుస్తుంది. కాబట్టి, అసలు తెలుసుకోవలిసిన రహస్యం, లాభం ఎలా వస్తుంది?- అనే గానీ, కోట్ల కోట్ల లంచాలు ఎలా ఇస్తారు- అని కాదు. సోలారు కరెంటు పరిశ్రమని ఒక ఉదాహరణగా చెప్పుకుందాం. ఈ పరిశ్రమలో, సోలార్ కరెంటుని తయారు చేయడానికి, సాధనాల కోసం ఖర్చుని 80 అనుకుందాం. ఆ సాధనాలను ఉపయోగిస్తూ, సోలార్ కరెంటు తయారవడానికి అవసరమైన 'శ్రమలు' చేసే కార్మికులందరి జీతాలూ కలిసి 20. ఇది రెండో ఖర్చు. 2 ఖర్చులూ కలిసి 80o20=100. ఇదే పెట్టుబడి. కరెంటు తయారైంది. ఇదే కొత్త సరుకు. దీన్ని అమ్మడానికి పెట్టుబడిదారుడే ధరని నిర్ణయిస్తాడు. ఇక్కడ ఈ సరుకు ధర 120. ఈ ధరతో అమ్మకం జరుగుతుంది. 100 ఖర్చుతో తయారు చేసిన కరెంటుకి, 120 ఎలా వచ్చింది? ఆ 20 అదనంగా ఎలా వచ్చిందో, క్లుప్తంగా చెప్పుకోవాలంటే: (1) సాధనాలు 80 విలువ గల శ్రమతో గతంలో తయారయ్యాయి. అవి నిర్జీవమైనవి కాబట్టి, అవి ఏ శ్రమా చెయ్యవు. అందుకే, అవి తమ విలువకంటే, ఎక్కువ విలువని ఇవ్వలేవు. వాటి విలువ 80గానే వుంటుంది గానీ పెరగదు. అయితే, తయారైన సరుకుని (కరెంటుని) 120కి అమ్మినప్పుడు, ఆ 120లో, సాధనాల 80 విలువని తీసివేస్తే, మిగిలిన 40 విలువ ఏమిటి? సాధనాలను ఉపయోగిస్తూ, కార్మికులు, పనిదినం అంతా, కొత్తగా చేసిన శ్రమల విలువ అది. కానీ, యజమాని కార్మికులకు జీతాల పేరుతో ఇచ్చేది 20 విలువ మాత్రమే! పనిదినం 10 గంటలనుకుంటే, మొదటి 5 గంటల్లోనే, కార్మికులు 20 విలువగల శ్రమ చేసేస్తారనుకుందాం. అంటే, వాళ్ళకి యజమాని ఇచ్చే జీతం విలువకి సమానమైన శ్రమ చేసేస్తారన్నమాట!

# నిరుపమాన నిస్వార్థ.. సేవాకుసుమ పరిమళం



అతన్ని ఎప్పుడు చూసినా అతని దరహాసం చెదరదు! ప్రతి ఒక్కరినీ నవ్వుతూనే పలకరిస్తారు! ఎంతో హృద్యంగా అనిపిస్తారు! ఎప్పుడూ వైట్ అండ్ వైట్ డ్రెస్ లోనే ఉంటారు స్వచ్ఛంగా! ఇట్టే కలసిపోతారు! ఎంతో హుందాగా ఉంటారు! ఎంతో ఆత్మీయంగా కనిపిస్తారు! ఇన్ని సులక్షణాలు ఒక్కరిలో వుండవు! కానీ ఆయనలో చూస్తాం! ఆయనే డా. కుసుమ భోగరాజు!



ఆయనొక నిరుపమాన నిస్వార్థ సేవాకుసుమ పరిమళం!

ఆయనేం చేస్తారు? ఎలా నిలదొక్కుకున్నారు? ఎలా ఆ చెదరని చిర్నవ్వు కాపాడుకున్నారో తెలియదు! కానీ అయనలా ఉండాలని పిస్తుంది ఎవరికైనా! అతను ఎంత సంపాదించాడో తెలియదు! ఏం చేస్తున్నాడో తెలియదు! కానీ, రెండు రోజులకో సారి ఫోటోలు కనిపిస్తుంటాయి! నిరుపేదలకు సాయం చేస్తున్న ఫోటోలు! నిత్యావసర వస్తువులు ఇస్తూ ఒకసారి! దుస్తులు దుప్పట్లు పంపిణీ చేస్తూ ఇంకోసారి! బియ్యం బస్తాలు అందిస్తూ ఒకసారి! అప్పుడు అతని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది నాలో!




కట్ చేస్తే, బిసి సంక్షేమ శాఖలో ఉన్నత అధికారిగా సేవలు అందిస్తూ మరోవైపు గాయనిగా తన ప్రతిభను కనబరుస్తున్న వెంకటేశ్వరి అలియాస్ ఆమని గారు నిర్వహించే శృతిలయ ఆర్ట్స్ అకాడమి కార్యక్రమాల్లో అతిధిగా, అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా నేను పాల్గొంటూ ఉంటాను! అక్కడ కనిపించారు కుసుమ భోగరాజు పదిహేనేళ్ల క్రితం! అప్పటి నుంచి ప్రతి నెలా జరిగే వారి ప్రోగ్రామ్స్‌కు సమన్వయకర్తగా ఆయన వ్యవహరిస్తూ వున్నారు! కనిపించినప్పుడల్లా ఎంతో ఆత్మీయంగా కాసేపు మాట్లాడుకునే వాళ్ళం!

ఒకరోజు తన సంస్థ ఆదర్శ ఫౌండేషన్ గురించి చెప్పారు! వారి అమ్మగారి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి చేస్తున్న సేవలు గురించి వివరించారు. మహా అద్భుతం అనిపించింది! మరో వైపు స్నేహ టివి డైరెక్టర్‌గా ఆ సంస్థను ప్రమోట్ చేయడంలోనూ, భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా పార్టీకి అందించిన సేవలు గురించి చెప్పారు. ఆశ్చర్యం అనిపించింది! ఒక్క వ్యక్తి ఇన్ని సేవలు చేయడం నిజంగా స్ఫూర్తిదాయకం! ఒక లక్ష్యం అంటూ ఏర్పరచుకుని ముందుకు వెళితే అది సాధ్యం! కుసుమ భోగరాజు కూడా అదే చేశారు. నిజాయితీగా, నిబద్ధత, నమ్మకంతో అనుకున్నవి సాధిస్తూ ముందడుగు వేశారు! సక్సెస్ అయ్యారు!

అవును అతనొక విజేత! అలా అని అతను సంపాదించింది ఏమీ లేదు! సింపుల్ జీవితం! సహకరించే భార్య, కుమారులు లభించడం అతని





అదృష్టభాగ్యం! అదే అతని సక్సెస్ సీక్రెట్! అందుకే అతని పేరు ముందు డాక్టర్ అని ఉండాలనిపించింది! జర్మనీ యూనివర్సిటీ కి అతని గురించి తెలియచేస్తూ ప్రొఫైల్ పంపించాను. ఆ యూనివర్సిటీ కూడా స్పందించి కుసుమ భోగరాజు సేవలు గుర్తించి గౌరవ డాక్టరేట్ తో అద్భుతంగా గౌరవించింది!

డబ్బులు ఉండి కార్పొరేట్ బాధ్యతగా సమాజానికి సేవలు అందించడం సహజం! డబ్బులు లేకుండా జీవితాన్ని సేవాభావంలో నడిపించడం అరుదైన వరం! అంతటి మహోన్నత వ్యక్తిత్వ మూర్తులు కొందరే ఉంటారు! అందులో కుసుమ భోగరాజు అగ్రభాగంలో ఉంటారు! అతని సేవాభావం సహృదయత ఎందరికో ఆదర్శం కావాలని కోరుకుంటున్నాను! అతని సేవలు ఇంకా విస్తరించాలని ఆశిస్తున్నాను. కుసుమ భోగరాజు గారికి ప్రత్యేక అభినందనలు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

**- డా. మహ్మద్ రఫీ**
**చీఫ్ ఎడిటర్, కళ పత్రిక**
**9848992826**

# జీవిత పరమార్థం ఇదే!



కేవలం తిని, త్రాగి, సుఖించడమే జీవితమని కొందరనుకుంటారు. కానీ అది మూర?త్వమే! జీవితం అనేది దేవుడు మనకు ఇచ్చిన గొప్ప బహుమానం. తల్లిదండ్రుల ద్వారా లభించిన విశిష్టమైన వరం. అట్టి విశిష్టమైన దానిని విశిష్టంగానే నిర్వహించాలి. అప్పుడే జీవితానికి అర్థం, పరమార్థం లభిస్తుంటాయి. తల్లిదండ్రుల ద్వారా దేవుడు ఇచ్చిన బహుమానమైన మన జీవితాన్ని అర్థవంతంగా నిర్వహించాలి ఆపై ముగించాలి. అదే అర్థాన్ని కలిగిస్తుంది. ప్రతి జీవితంలో అనేక మజిలీలు ఉన్నా రెండే ముఖ్యమైనవిగా ఉంటాయి. అవి పుట్టుక, చావు అనేవి. ఈ రెండిటి మధ్య ఉండే నిడివే జీవితం. అదే అర్థవంతంగా నిర్వహించబడాలి. అప్పుడే సార్థకత చేకూరుతుంది. ఎవరైనా సరే తమ పుట్టుకతో ఖాళీ చేతులతో వస్తే, అవే ఖాళీ చేతులతో తిరిగి చావుతో వెళ్ళిపోతుంటాం! ఈమధ్య గ్యాప్ కోసమే నా వెంపర్లాట? మనం ఏది విత్తితే ఖచ్చితంగా అదే కోస్తాం! చేసిన పనులకు ఫలితాలను అనుభవించక తప్పదు. అదే కర్మ సిద్ధాంతం. మంచి చేస్తే మంచే జరుగుతుంది. చెడు చేస్తే ఖచ్చితంగా చెడు జరుగుతుంది. అదీ రెట్టింపులో! ఈ వాస్తవ సత్యాన్ని గ్రహించాలి. ఖచ్చితంగా జీవితం గడ్డి పోచ వంటిదే, కాస్త ఓపికతో ఆలోచిస్తే వాస్తవ విషయాలు వెల్లడవుతుంటాయి. అదే జ్ఞానం అవుతుంది. సూర్యోదయాన్ని పుట్టుకతో పోల్చితే, మధ్యాహ్నాన్ని యవ్వనంతో, సాయంత్రాన్ని వృద్ధాప్యంతో, రాత్రిని మరణంతో పోల్చవచ్చు. ఉదయం ఆహ్లాదకరంగా ఉంటే, మధ్యాహ్నం ఆనందంగాను, సాయంత్రం దిగాలుగా, రాత్రి భయంగా ఉంటుంది. జీవితం కూడా ఇలాంటిదే. మనం ఉదయం నుంచి సాయంత్రం వరకు చేసే పనులే రాత్రి అనుభవాలను కలిగిస్తాయి. మంచి చేస్తే అర్థవంతంగా ఉంటూ ప్రశాంతంగా నిద్ర పడుతుంది. చెడు చేస్తే ఆందోళనలతో నిద్రపట్టక చెడే కలుగుతుంది. తమ తమ జీవితాలకు అర్థం కలిగించేలా జీవించిన గొప్ప



వ్యక్తులు చరిత్రలో మహానుభావులుగా నిలిచిపోయారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు చరిత్రహీనులుగా అడ్రస్సు లేకుండా పోయారు. మనం చేసే పనులే ఆ స్థితిని నిర్ణయిస్తాయి. అందుకే జీవితాన్ని అర్థవంతంగా నిర్వహించాలి. అర్థమంతమంటే ఇతరులకు మాదిరిగా, నిజాయితీగా, ఉపయోగకరంగా ఉండటమే!దీనినే ఫలించే ద్రాక్షావళిగా అంటారు. జీవితాన్ని అర్థవంతంగా నిర్వహించాలంటే జ్ఞానం అవసరం. నిశితంగా, గూఢంగా ఆలోచిస్తే జ్ఞానం, వివేకం రెండూ వేరే! జ్ఞానం వాస్తవాలను తెలుపుతుంది. వివేకం అనుభవం వలన కలుగుతుంది. విద్య వల్లనే ఈ రెండూ గమనించబడుతుంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి విద్యాభ్యాసం తర్వాత తన విద్య ద్వారా కలిగిన జ్ఞానంతో ఉద్యోగాన్ని సాధిస్తే! వివేకం సదరు ఉద్యోగాన్ని అర్థవంతంగా, నీతివంతంగా నిర్వహించేలా చేస్తుంది. ఫలప్రదం చేస్తుంది. జీవితం అర్థవంతంగా ఉండాలంటే శ్రమించాలి. నిజాయితీగా శ్రమిస్తే ఖచ్చితంగా ఫలిస్తుంది. పని మన సామర్థ్యాన్ని తెలుపుతుంది. అందుకే పని చేయగల సామర్థ్యమే శక్తి అన్నారు. ఇక కొన్ని వాస్తవాలను ప్రస్తావిస్తాను. దయతో కాస్తంత ఓపికతో చదువుతూ వాస్తవ సత్యాలను గమనించాలి మరి. సంపద కోరే వారు ఈ ఐదు దోషాలను వెంటనే త్యజించాలి. అవి, అతి నిద్ర (సోమరితనం), భయం (అజ్ఞానం), క్రోధము (కోపం), అలసిపోవడం (శ్రమించే తత్వం లేమి), నిర్దిష్ట



పనులను చేయకపోవడం. వీటిని త్యజిస్తూ, ఈ దిగువ పేర్కొన్న ఏడు గుణాలను కలిగి ఉంటే ఇక జీవితం అర్థవంతంగా ఉంటుంది. అవి: సత్యాన్ని పాటించడం, దానం చేయడం (అర్హులకు), అన్నివేళలా చురుకుగా ఉండడం, సహనంతో ప్రవర్తించడం, అసూయ లేకుండా ఉండటం, ఈర్ష ద్వేషాలను త్యజించడం, ఎప్పటి పనులను అప్పుడే అర్థవంతంగా నిర్వహించడం. ఇవి పాటిస్తే జీవితానికి అర్థం చేకూరుతుంది. ఇక మరికొన్ని విషయాలను గ్రహించండి.

- జీవితంలో వచ్చి, పోయేవి మూడు. అవి. పేదరికం, వ్యాధి, డబ్బు.
- జీవితంలో వస్తే పోనివి మూడు, అవి: కీర్తి, జ్ఞానం, విద్య. వీటిని ఎవరూ దొంగిలించలేరు, వీటిని మన నుంచి ఎవరూ ఏ శక్తి వేరు చేయలేదు. వీటిని పొందే ప్రయత్నం చేయాలి. యధార్థతను కలిగి ఉండాలి.
- జీవితంలో మరలా రానివి మూడు. అవి కాలం, యవ్వనం, పరువు అనేవి.
- జీవితంలో మనం చేసే పనుల వలన మన వెంట వచ్చేవి మూడు. అవి. పాపం, పుణ్యం, నీడ.


ఇక పాపపు పనులు అంటే ఇతరులకు కీడు చేయడం, తప్పులు చేయడం, మనస్సులో చెడు ఆలోచనలు, అబద్ధములు చెప్పడం, నోటితో పరుష వాక్యములు కలపటం, పరులవి ఏదైనా ఆశించడం, ఇతరులకు నష్టం కలిగించడం, బాధను కలిగించడం, ఇవన్నీ పాపము పనులే! ఇక పుణ్యం కలిగించే పనులు అంటే దేవుని పేరు పలకటం, దేవుని యందు భయభక్తులు, దేవుని పూజించుట, ప్రార్థించుట. దేవునికి నమస్కరించుట, ఆయన బోధనలు చెప్పినవి ఆచరించడం. తల్లిదండ్రులను, పెద్దలను విధిగా గౌరవించడం. ఉదాహరణకు పితృ వాక్య పరిపాలన వలన రాముడు కీర్తి గడించారు. సత్యం చేత హరిశ్చంద్రుడు ఖ్యాతి పొందారు. దానము చేత బలి చక్రవర్తి ఘనత సాధించారు. ఓర్పు చేత ధర్మరాజు గుర్తించబడ్డారు. పెద్దలు తలపెట్టిన పనులను నెరవేర్చి భగీరథుడు ప్రఖ్యాతినొందారు. ఇలా అనేకులు మహానుభావులు, మహాత్ములు తమ తమ మంచి పనులు, ఆలోచనలతో చరిత్రలో నిలిచిపోయారు. ఈ సృష్టి కొనసాగినంత వరకు వారి గుర్తింపు కొనసాగుతుంది. వారు ధన్యులు.జీవితానికి అర్థం చూపిన వారు.

అలాగే కన్న తల్లితండ్రులను ఆదరిస్తూ చక్కగా పోషించిన వారు. విద్యను, ఉపదేశమును, విలువలతో చెప్పినవారు. ఆపద సమయంలో ఆదుకునే వారు, భయాన్ని పోగొట్టేవారు, పేదలను కనికరించేవారు, చెడులకు అతి దూరంగా ఉంటూ, మంచిని చేస్తూ మంచి కోరుకునే వారు దేవదూతలతో (దేవుళ్ళ తో ) సమానులు. వీరిలో దైవత్వం ఉట్టిపడుతుంది. అట్టి వారితో సహవాసం చేస్తే జీవితానికి అర్థం చేకూరుతుంది. బంగారానికి పుటము పెట్టబడినను దాని వన్నె మారదు. గంధపు చెక్క అరిగినను వాసన విడువదు. పాలు కాగినను రుచి, రంగు మారదు. మాణిక్యమునకు ఎంత సాన పట్టినా దాని కాంతి తగ్గదు. సదా వెలుతురు ఇచ్చే సూర్యుడు ఎంతగా వెలుతురునిచ్చినా తన వన్నె కోల్పోడు. మంచివారు ఎన్ని ప్రయాసలకు గురైనా మర్యాద తప్పరు. ఇచ్చిన మాట తప్పరు. ఇలాంటివే జీవితానికి అర్థాన్ని కలిగిస్తుంటాయి. పుట్టుక చావులనేవి జీవితానికి సర్వసాధారణం. ఆ రెండింటికి మధ్య కాలమే జీవితం. అట్టి జీవిత కాలాన్ని అర్థవంతంగా, ఫలప్రదంగా నిర్వహించే వారు ఖచ్చితంగా విజ్ఞులు. దైవ సమానులు!

**డాక్టర్ యం. ప్రభు దయాల్**
**మాజీ సెనెట్ సభ్యులు - కాకతీయ యూనివర్సిటీ**
**జీవిత సభ్యులు - ఐ ఎ టి ఇ మండల విద్యాధికారి**
**కొత్తగూడెం**



# ధర్మాన్ని ఆచరించండి..అన్నీ లభిస్తాయి



వేదవ్యాసుడి జీవిత కథ ఆద్యంతం అద్భుతం. వ్యాసుడు వసిష్ఠుడికి ముని మనమడు. శక్తి మహర్షికి పౌత్రుడు. పరాశరుడి పుత్రుడు. తపో నిధి అయిన పరాశరుడు యమున దాటడానికి పడవ ఎక్కడమేమిటి? దాటించేందుకు తండ్రి స్థానంలో దాశ పుత్రి తాను పడవ నడపడమేమిటి? మహర్షి అకస్మాత్తుగా మత్స్య గంధిని మోహించడమేమిటి? తన తపశ్శక్తి ద్వారా ఆమె అభ్యంతరాలన్నిటినీ తొలగించటమేమిటీ? ఆ యమునా నదీ ద్వీపంలో ఆమెకు అయాచితంగా పుత్రుడిని ప్రసాదించటమేమిటి? అప్పటికప్పుడే సకల శాస్త్రవేత్త అయిన పుత్రుడు పుట్టు కురావడమేమిటి? పుడుతూనే తల్లిని విడిచి తపోవనాలకు వెళ్లిపోవటమేమిటి? ఇదంతా లోక కల్యాణం కోసం లోకాతీతుడిని అవతరింపజే సేందుకు లోకేశ్వరుడు ప్రదర్శించిన విచిత్ర విలాసం.ఆ కారణజన్ముడి జన్మకు ప్రయోజనం మాన వాళికి చతుర్విధ పురుషార్థ సాధన రహస్యాలను బహువిధాలుగా బోధించటం. అందుకే ఆయన జగద్గురువులకే గురువుగా నిలిచిపోయాడు. అగమ్యంగా ఉన్న వేదరాశి చిక్కులు విప్పి, చక్కబరచి, అధ్యయనానికి అనువుగా చతుర్వేదాలుగా విభజించి, వైదిక ధర్మప్రవర్తనం చేసిన ఆది గురువు వేదవ్యాసుడు. పంచమవేదమైన భారతేతిహాసం ద్వారా 'ధర్మాన్ని ఆచరించండి. అన్నీ లభిస్తాయి' అని పదేపదే ఎలుగెత్తి ఘోషించిన సకల లోక హితైషి సాత్యవతేయుడు. అర్థ కామ సాధనల విషయాలను విస్త రించి, అనేక నీతి కథల భాండాగారాలైన అష్టాదశ పురాణాల ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఆప్తుడు వ్యాసుడు.బాదరాయణ బ్రహ్మ సూత్రాల ద్వారా వేదాంత సారాన్ని సూత్రీకరించి, మనుషులం దరికీ మహత్తర లక్ష్యమైన మోక్ష పురుషార్థానికి బంగారు బాట పరచిన వాడూ పరాశరుడే. ఇంతటి మహోపకారి అయిన ఈ జ్ఞాన చంద్రుడు ఉదయించిన ఆషాఢ పూర్ణిమ శుభతిథిని ఆసేతు శీతాచలమూ గురు పూర్ణిమ పర్వదినంగా జరుపుకోవటం సర్వవిధాలా సముచితమైన సంప్రదాయం. ఆ సందర్భంగా ప్రత్యేకంగా అస్మాదాచార్య పర్యంతమైన గురుపరంపరను సాదరంగా సంస్మరించుకొని, యథాశక్తి కృత జ్ఞతను ప్రకటించుకోవటం మన కనీసపు కర్తవ్యం.



## జింక్ కూడా ముఖ్యమే




విటమిన్ డీ, ఐరన్ మొదలైనవి తక్కువ అయితే ఏం జరుగుతుందో చాలా మందికి తెలుసు. కానీ మన శరీరానికి అత్యంత అవసరమైన జింక్ గురించి మాత్రం తెలియదు. మన శరీరానికి ప్రతి రోజు కనీసం 8 నుంచి 10 మిల్లీగ్రాముల జింక్ అవసరమవుతుంది. ఒక వేళ జింక్ తక్కువ అయితే దాని ప్రభావం శరీరంపై పడుతుంది. అప్పుడు శరీరం కొన్ని సంకేతాలు పంపుతుంది. ఆ సంకేతాలు ఏమిటో తెలుసుకుందాం.

తరచూ ఇన్‌ఫెక్షన్లు:జింక్ తగ్గటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీని వల్ల వైరస్, బ్యాక్టీరియాలపై రోగనిరోధక వ్యవస్థ సరైన పోరాటం చేయలేదు. దీనితో తరచు ఇన్‌ఫెక్షన్లు వస్తూ ఉంటాయి.

గాయాలు నెమ్మదిగా

గాయం మానాలంటే కణాల విభజన సక్రమంగా, చురుకుగా జరగాలి. ఈ రెండు ప్రక్రియలలోను జింక్ కీలకపాత్ర పోషిస్తుంది. జింక్ సరిగ్గా లేకపోతే గాయాలు త్వరగా మానవు.

జుట్టు ఊడిపోవటం

జింక్ తక్కువ ఉంటే జుట్టు ఊడిపోతూ ఉంటుంది. ఎవరికైనా జుట్టు ఊడిపోతుంటే జింక్ విలువలు ఎలా ఉన్నాయో తెలుసుకోవటానికి పరీక్షలు చేయించుకోవాలి.

ఆకలి మందగించటం

జింక్ తగ్గటం వల్ల రుచి, వాసన సరిగ్గా తెలియవు. దీని వల్ల ఆకలి తగ్గుతుంది. ఆకలి వేయకపోతే ఆహారం సరిగ్గా తినరు. దీని వల్ల తగినంత జింక్ లభించదు. ఇదంతా ఒక వలయంగా తయారవుతుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5
హైదరాబాద్
సోమవారం
02 I డిసెంబర్ I 2024

# ఆమెకు తారలే అభిమానులు



కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

**ఆమెకు తారలే అభిమానులు**

కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

"నా బాల్యం చాలా విచిత్రంగా గడిచిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నన్ను నేనే నమ్మలేనంతగా మారిపోయింది నా శరీరం... జీవితం. చిన్నప్పుడు నేను చాలా బద్ధకస్తురాలిని. ఆడుకోవడం, తినడం, టీవీ చూడటం, పడుకోవడం ఇదే నా దినచర్య. నా బాల్యమే కాదు, యుక్తవయసు కూడా అలాగే సాగిపోయింది. ఎంత బద్ధకస్తురాలినంటే... కొన్నిసార్లు స్కూల్ నుంచి వచ్చాక యూనిఫామ్ మార్చకుండా పడుకునేదాన్ని. పిజ్జాలు, బిర్యానీలంటే పిచ్చి. బర్గర్లు, నూడుల్స్‌లాంటి ఫాస్ట్ ఫుడ్‌తోనే కడుపు నిండిపోయేది. నన్ను, నా అలవాట్లు చూసి మా అమ్మ ఎంతో ఆందోళన చెందేది. నా బద్ధకం ఎలా వదిలించాలో తెలియక బాధ పడేది. అలాంటి నేను ఇవాళ యాభై నాలుగేళ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా, క్రమశిక్షణగా ఉన్నానంటే ఎదుటివారికే కాదు, నాకూ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక సంకల్పంతో నిబద్ధతగా కష్టపడితే అసాధ్యమైన లక్ష్యం ఏదీ ఉండదనేది నా నమ్మకం. ఆ నమ్మకమే నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది.

**టామ్‌బాయ్‌లా...**

నేను పుట్టింది అమెరికాలో. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. తరువాత ముంబయికి వచ్చాం. సెయింట్ జేవియర్ కాలేజీలో చదివాను. నా స్నేహితుల్లో ఎక్కువ మగపిల్లలు ఉండేవారు. దాని కోసమే అమ్మను అడిగాను... కోఎడ్యుకేషన్ కాలేజీలో చేర్పమని. అప్పుడైతే వారితో కలిసి ఆడుకోవచ్చనేది నా ఉద్దేశం. నాకు నచ్చినట్టు జడ వేయడానికి అమ్మకు గంటకు పైగా పట్టేది. ఒక రోజు విసిగిపోయి సెలూన్‌కు తీసుకువెళ్లి నా జుట్టు కట్ చేయించింది. షార్ట్ హెయిర్‌తో అప్పటి నుంచి నా ఆహార్యం కూడా టామ్‌బాయ్‌లా మారిపోయింది. ఇక కళాశాలలో నేను ఆడినవి రెండే ఆటలు. షార్ట్‌పుట్, జావెలిన్ త్రో. మన బలం చూపించుకొనే క్రీడలు కదా అవి. అందుకే వాటిని ఎంచుకున్నా. టీనేజీలో రెబల్‌గా ఉండేదాన్ని. ఎవరైనా ఇది చేయమని చెబితే నాకు అస్సలు నచ్చేది కాదు.

**స్నేహితురాలితో వెళ్లి...**

నా ఫిట్‌నెస్ ప్రయాణం అనుకోకుండా మొదలైంది. ఒక రోజు నా స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. అప్పటికే తను ఓ అబ్బాయితో ప్రేమలో ఉంది. అందుకే బరువు తగ్గాలని అనుకొంటున్నానని, దాని కోసం జిమ్‌కు వెళ్లాలని, నన్ను తోడు రమ్మని అడిగింది. అప్పుడు నా వయసు పద్దెనిమిదేళ్లు. స్నేహితురాలు అడగడంతో కాదనలేకపోయాను. కొన్నిసార్లు మన జీవితంపై ఎదుటివారి ఒత్తిడి అనేక విధాలుగా పని చేస్తుంది. అయిష్టంగానే తన వెంట జిమ్‌కు వెళ్లి, నేనూ ఫిట్‌నెస్ క్లాస్‌లో చేరాను. ఏరోబిక్స్ సెషన్‌తో నా ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. డ్యాన్స్ మూమెంట్స్‌లా ఉండే ఆ వ్యాయామాలు నాకు బాగా నచ్చాయి. జిమ్‌కు వెళ్లేవరకు అందరు అమ్మాయిల్లా నేనూ బాగా డ్యాన్స్ చేయగలననే నమ్మకం ఉండేది. ఏరోబిక్స్ మొదలుపెట్టాకే తెలిసింది... నాకు అసలు డ్యాన్స్ రాదని. నా కదలికలు మిగిలినవారికి భిన్నంగా ఉండేవి. అందరూ నన్ను వింతగా చూసేవారు. అది నాకు అవమానంగా అనిపించింది. దాంతో పట్టుదల పెరిగింది. ఒక్కరోజు కూడా మానకుండా జిమ్‌కు వెళ్లాను. ఎంతో శ్రమించాను. బాగా మెరుగయ్యాను.

**టీచర్ సలహాతో...**

నాలోని పట్టుదల, నైపుణ్యం చూసిన మా ఏరోబిక్స్ టీచర్... అమెరికాలో ఫిట్‌నెస్ కోర్సు చేయమని చెప్పారు. ఆమె సలహాతో 'అమెరికన్ కాలేజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్'లో చేరి, ఫిట్‌నెస్ శిక్షణ తీసుకున్నాను. అలా ఒక ఫిట్‌నెస్ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయురాలిని నేనే. అదే సమయంలో కిండర్‌గార్డెన్ టీచర్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ముంబయికి తిరిగి వచ్చాక ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టాను. ఉదయం టీచింగ్, సాయంత్రం ఫిట్‌నెస్ క్లాస్‌లు. రోజూ నగరంలో ఈ చివర నుంచి... ఆ చివరకు ప్రయాణం. కొన్ని నెలలు గడిచాయి. 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తరువాత మినాజ్ కరాచీవాలతో పెళ్లయింది. మా అబ్బాయి పుట్టాక ఫిట్‌నెస్ తరగతులు కుదించుకున్నా.

**అవహేళన చేసినా...**

మా బాబు కాస్త పెరిగే వరకు నా అవసరం ఉంటుంది కదా. దాని కోసం చాలా అవకాశాలు వదులుకున్నా. కుదిరిన సమయంలోనే శిక్షణ ఇచ్చేదాన్ని. అయితే అందరిలా కాకుండా... నాకంటూ ఒక గుర్తింపు కావాలనిపించింది. దాంతో మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు క్రమంగా పెరిగారు. దాంతో మా గెస్ట్ రూమ్‌ను ఫిట్‌నెస్ స్టూడియోగా మార్చాను. కొన్నాళ్లకు అది సరిపోక స్టూడియో... లివింగ్ రూమ్‌కు, తరువాత టెర్రస‌కు, అక్కడి నుంచి బాంద్రాలోని పెద్ద హాల్‌కు మారింది. ఇంట్లో నేను తరగతులు చెప్పినంతసేపూ మావారు నాకు తోడుగా ఉండేవారు. ఇంకా ఏదో చేయాలన్న తపనతో అమెరికా వెళ్లి పిలెట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. తద్వారా భారత్‌లో తొలి బీఏఎసఐ (బాడీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఇంటర్నేషనల్) సర్టిఫైడ్ పిలెట్స్ ఇన్‌స్ట్రక్టర్‌ను అయ్యాను.

**తారల ట్రైనర్‌గా...**

ఇక అప్పటి నుంచి నా జీవితమ అనూహ్య మలుపు తీసుకుంది. బాలీవుడ్ తారల నుంచి పిలుపు వచ్చింది. కత్రినా కైఫ్, దీపికా పదుకొనే, కరీనా కపూర్, అలియాభట్... దాదాపు ప్రముఖ హీరోయిన్లు అందరితో కలిసి పని చేశాను. వారికి వ్యక్తిగత ట్రైనర్‌గా కూడా ఉన్నాను.



పర్సనల్ ట్రైనర్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా. దీన్ని గమనించిన కొందరు తమకు కూడా అలాంటి ఆకృతి కావాలంటూ అడిగారు. తరువాత వారందరూ నా శిష్యులు అయ్యారు.

**స్టూడియోకు శ్రీకారం...**

ఫిట్‌నెస్ పాఠాల కోసం నా దగ్గరకు వచ్చేవారు 'యాస్మిన్ బాడీ ఇమేజ్' పేరిట ముంబయిలో అతిపెద్ద పిలెట్స్ స్టూడియో నెలకొల్పాను. దాంతోపాటు నగరంలోనే మరో రెండు, ఢిల్లీ, దుబాయ్, ఢాకాల్లోనూ ఫ్రాంచైజీలు ప్రారంభించాను. రెండున్నర దశాబ్దాలకు పైబడిన నా ఈ ప్రయాణంలో... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నాను. భారత్‌లో ఫిట్‌నెసను ఒక పరిశ్రమ స్థాయికి తీసుక వెళ్లానని ప్రముఖులు ఎందరో కొనియాడారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది."

# లాంగ్ గౌన్లు..క్రాప్ టాప్‌లు!





ప్రపంచం కుగ్రామం అయింది.. ఫ్యాషన్ అంతా ఒక్కటైపోయింది.. అందుకే మనదగ్గర వెస్ట్రన్ వేర్ సర్వసాధారణమైపోయింది.. ఇండోవెస్ట్రన్ ?స్టైల్‌లో ఉండే లాంగ్ గౌన్లు.. కాస్త మోడ్రన్ టచ్‌తో ఉండే లెహంగా, క్రాప్ టాప్‌లు.. ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి.. పెళ్ళిళ్ళు, పేరంటాలకు ఇవే సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి..

ఇక్కత్ ఎక్కడున్నా మిమ్మల్ని సెంటరాఫ్ ఎట్రాక్షన్ చేస్తుంది. నల్లని సిల్క్ ఇక్కత్‌ని లాంగ్ గౌన్‌గా కుట్టాం. దీనికి వచ్చిన పెద్ద బార్డర్ హైలైట్‌గా కనిపిస్తున్నది. ఇక పైన ఆరెంజ్ కలర్ ప్యూర్ సిల్క్‌ని జతచేసి దానికి పోట్లీ బటన్స్ ఇచ్చాం. స్లీవ్స్ మీద సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌తో నింపేశాం.

ఆకుపచ్చ సిల్క్ క్రాప్ టాప్ ఇది. దీని మీద గోటా పట్టీ, జర్దోసీ వర్క్‌తో నింపేశాం. దీనికి కూడా కోల్డ్ షోల్డర్ అద్దినట్లు ఉంది. ఇక పీచ్ కలర్ ప్యూర్ సిల్క్ లెహంగా మీద ఫుల్‌గా రాజస్థానీ ?స్టైల్‌లో గోటా పట్టీ వర్క్ చేయించాం. పిస్తా గ్రీన్ కలర్ బార్డర్‌ని జత చేసి దాని మీద గోల్డెన్ లేస్ కుట్టడంతో లెహంగా లుక్కే మారిపోయింది.

నీలాకాశంలో మెరిసే తారకలా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! లైట్ బ్లూ నెట్ ఫ్యాబ్రిక్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. వెస్ట్రన్ స్టైల్‌లో ఉండేలా ఎక్కువ గేర్‌తో దీన్ని కుట్టాం. నెక్ దగ్గర సీక్వెన్స్, చిప్స్‌తో హెవీగా వర్క్ చేశాం. 3/4 స్లీవ్స్‌తో గౌన్ లుక్కే మారిపోయింది.

ఎండలో వెన్నెల్లా కనిపించేందుకు తెల్లని లాంగ్ గౌన్ పర్‌ఫెక్ట్ ఛాయిస్. తెల్లని ఆర్గంజా మీద ఎర్రని పూల మాదిరి ఆప్లిక్ వర్క్ చేశాం.

డ్రెస్ మొత్తం ఇదే వర్క్ వస్తుంది. బాక్స్ ప్లీట్స్ పెట్టి పైన ఎర్రని లైక్రా ఫ్యాబ్రిక్ అటాచ్ చేశాం. దీనికి హాల్టర్ నెక్ హైలైట్‌గా నిలిచింది.

డార్క్ బ్లూ కలర్ వెల్వెట్‌తో లెహంగా కుట్టాం. దాని మీద మొత్తం జరీ వర్క్‌తో నింపేశాం. గోల్డెన్ జరీ వచ్చిన లేస్‌ని బార్డర్‌గా జతచేశాం. ఇక క్రాప్‌టాప్‌కి పింక్ కలర్ ప్యూర్ సిల్క్ ఎంచుకున్నాం. దీని మీద కుందన్స్, జర్దోసీ, ముత్యాలతో హెవీగా వర్క్ చేశాం. కోల్డ్ షోల్డర్, ఫుల్‌స్లీవ్స్‌తో రాజకుమారిని తలపింపొచ్చు. స్లీవ్స్ మీద గ్లాస్ ట్యూబ్స్‌తో వర్క్ చేశాం.







## తల్లులు ఊబకాయులైతే..

ఊబకాయంతో ఉండే తల్లులకు పుట్టే పిల్లల్లో రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుందని ఇటీవల చేసిన ఒక స్టడీలో వెల్లడైంది. అదే సమయంలో లావుగా లేని అమ్మలకు పుట్టిన బిడ్డల్లో మాత్రం ఈ లోపం కనిపించడంలేదని అధ్యయనకారులు పేర్కొన్నారు. తల్లి కావడానికి ముందర ఆడవాళ్లు భారీకాయంతో ఉంటే దాని ప్రభావం వాళ్లకి పుట్టే బిడ్డల్లో కనిపిస్తుందట. గుండెజబ్బులు, ఆస్తమా వంటి జబ్బుల బారిన పడే అవకాశం ఉందని ఈ స్టడీని నిర్వహించిన కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఇహెమ్ మెసాద్ తెలిపారు.

ఈ స్టడీలో ప్రధానంగా ఊబకాయులైన తల్లులకు పుట్టిన పిల్లల్లో రోగనిరోధకశక్తిపై, వారికి వచ్చే జబ్బులపై రీసెర్చ్ చేశారు. ఈ స్టడీ అమెరికాలోని 39 మంది తల్లులపై చేశారు. లావుగా ఉన్న తల్లులకు, సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడు నుంచి కణాలు తీసి పరీక్షించారు. అందులో ఊబకాయులైన తల్లులకు పుట్టిన బిడ్డలు బాక్టీరియల్ యాంటిజన్స్‌కు సరిగా స్పందించడం లేదు. కానీ సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన బిడ్డల్లో బాక్టీరియల్ యాంటిజెన్స్‌కు స్పందన బాగా ఉండడాన్ని గుర్తించారు. ఊబకాయంతో ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల్లో మనిషి రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన సిడి4టి కౌంట్ తగ్గడం గమనించారు. ఆస్తమా, ఇతర రకాల ఎలర్జీల నివారణలో ముఖ్యపాత్ర వహించే రోగనిరోధక కణాల సంఖ్య ఊబకాయమున్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడులో తక్కువగా ఉండడాన్ని కూడా ఈ అధ్యయనంలో గుర్తించారు.

## ఒత్తిడిని అధిగమించేందుకు మార్గాలున్నాయ్

ఈ రోజులలో ఒత్తిడికి గురికాకుండా ఎవరైనా ఉన్నారా అంటే... లేరనే చెప్పాలి. కాలంతోపాటు పరిగెత్తే క్రమంలో ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఒత్తిడిని అధిగమించడంపై పుస్తకాలు, టీవీలలో ప్రసారాలు, పత్రికలలో ప్రత్యేక కథనాలు కూడా వస్తుంటాయి. కౌన్సెలింగ్ తరగతులు కూడా కొందరు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా యోగా సెంటర్లు స్ట్రెస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇంటర్నేషనల్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన ఒత్తిడి నుంచి అధిగమించడానికి ఏమేమి చేయాలన్నదానిపై కొన్ని సూచనలు ఇస్తోంది.ఒత్తిడి ఎవరెవరిలో ఉంటుంది? వ్యవసాయదారులు పంటలు పండకపోతే, తెచ్చిన రుణం తీరకపోతే, చేతికొచ్చిన పంట ఎండిపోతే, తుపానుకు తుడిచి పెట్టుకుపోతే, తగిన ధర రాకపోతే ఒత్తిడికి గురవుతారు. 40 నుంచి 50 శాతం మంది రైతులలో ఒత్తిడి ఉంటుందని అంచనా. గృహిణులు కూడా ఒత్తిడికి గురవుతారట. ఉదయం నిద్ర లేచినప్పటినుంచి వారు చేసే పని అంతా కూడా ఒత్తిడితోనే ఉంటుంది. ఉద్యోగాలకు వెళ్ళేవారయితే పిల్లలను పాఠశాలలకు వెళ్ళేందుకు సిద్ధం చేయడం ఒక ఎత్తయితే, వారు ఉద్యోగానికి సమయానికి చేరుకోవడం కూడా మరొక ఎత్తు. గృహిణులలో 40 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. ఉపాధ్యాయులు, ఉద్యోగులుకు సంబంధించి 20 నుంచి 30 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయనాయకులలో సుమారు 50 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయ నాయకులు పదవుల కోసం. ఎన్నికలలో గెలుపుకోసం. మంత్రి పదవులకోసం వంటి స్వీయపనుల కోసం ఒక ఒత్తిడి అయితే. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేక ఇబ్బందులు పడుతూ ఒత్తిడి గురవడం ఇంకొకటి. పోలీసులలో 60 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. సొంత వ్యాపారాలు చేసే వారికి మరింతగా ఒత్తిడి ఉంటుంది. దాదాపు 70 శాతంమంది ఒత్తిడికి గురవుతారట. పోటీని తట్టుకుని వ్యాపారం చేయడంలో, లాభాలను ఆర్జించడంలో, తెచ్చిన రుణాలను తీర్చక ఇబ్బంది పడుతున్న సమయంలో ఒత్తిడికి గురవుతారట. ఎగ్జిక్యూటివ్‌లు తమకు ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చలేక ఒత్తిడికి గురవుతుంటారు. విద్యార్థులు కూడా పోటీపరీక్షలలో పాల్గొనేందుకు, రెగ్యులర్ పరీక్షలలో బెస్ట్ ర్యాంక్ తెచ్చుకునేందుకు ఇలా పలు రకాల ఒత్తిడిలు వారిపై కూడా ఉంటాయి. శ్వాసకోస వ్యాధులు, అజీర్ణవ్యాధులు, కడుపునొప్పి, చర్మవ్యాధులు, బ్లడ్ ప్రషర్, మధుమేహం, నిద్రపట్టకపోవడం, గుండెల్లో దడ, మైగ్రేన ఇలాంటి కొన్ని వ్యాధుల కారణంగా కూడా ఒత్తిడి ఉంటుంది. అలసట, అనారోగ్యసమస్యలు, సంసారం సరిగా సాగనప్పుడు, ఈర్ష్యా ద్వేషాలు ఉన్నపుడు, భయం అవహించి ఉండడం, విపరీతమైన భ్రాంతితో ఉండడం ఇలా ఎన్నో ఎన్నెన్నో... ఒత్తిడినుంచి అధిగమించేందుకు... విశ్రాంతి తీసుకోవాలి. ఎంత సమయం పాటు విశ్రాంతి తీసుకోవాలన్నదానిపై కొలమానం ఏదీ లేదు. మనస్సు ఆహ్లాదకరంగా ఉందనిపించేంత వరకు విశ్రాంతి తీసుకోవచ్చు. యోగా చేయవచ్చు, ప్రకృతి సుందర ప్రదేశాలు, దేవాలయాలను దర్శించవచ్చు. పర్యటనలకు వెళ్ళవచ్చు. ముఖ్యంగా ఒత్తిడిని జయించేందుకు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం. ఒత్తిడీ ఒక మేలే.. నిజంగా ఒత్తిడీ ఒకమేలేనని చెబుతారు. ఒత్తిడి నుంచి ఉత్తేజితులవ్వాలి. ముఖ్యంగా చదువుకునే విద్యార్థి నుంచి దేశాధినేత వరకు అందరిలోనూ ఒత్తిడి ఉంటోంది. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ చేసే వాళ్ళకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి అనేది లేకపోతే కొందరు బద్ధకస్తులు అవుతారు. పనిని తొందరగా చేయాలని ఆనిపించడమే ఒత్తిడి.

ఏం చేయాలి? ..ఇప్పుడు ఎంత పని చేయగలమో అంతే చేయాలి. రేపటి గురించి తరువాత ఆలోచన చేయాలి. సమస్యలను ఎదుర్కొనడానికి సిద్దపడాలి. కష్టంవస్తే కుంగి పోకూడదు. ఖాళీగా ఉన్న సమయంలో ఒత్తిడిని అధిగమించేందుకు ప్రయత్నాలు చేయాలి. పుస్తక పఠనం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుంది. ఆత్మీయుల వద్దకు వెళ్ళి కాసేపు మాట్లాడితే ,ఇష్టమైన ప్రాంతానికి పర్యటనకు వెళితేకూడా ఉపశమనం ఉంటుంది. పదిమందిలో కాసేపు కూర్చుని సరదాగా మాట్లాడండి.




## టర్నోవర్ రూ.50 లక్షలు దాటిందా..?

**న్యూఢిల్లీ-నవభూమి:**నవీన్ చంద్ర ఒక వస్త్ర వ్యాపారి. రాష్ట్రవ్యాప్తంగా పలు ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ నిర్వహిస్తున్నారు. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులకు బకాయిలను సకాలంలో చెల్లించాల్సిందిగా తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది, డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్ను మొత్తాన్ని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి మిగతా మొత్తాన్ని నగదు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా వాడాల్సి ఉండగా మొత్తం పన్నును ఐటీసీ ద్వారా చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించమని తెలపటం జరిగింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అసలు ఈ 99 శాతం లెక్కేమిటీ? ఐటీసీని తీసుకోవటానికి నియమ నిబంధనలు ఎలా ఉన్నాయో తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి.

పన్ను చెల్లించేటప్పుడు ముఖ్యంగా ఐటీసీ ద్వారా పన్ను చెల్లించేటప్పుడు ఈ విషయాలు తెలుసుకోవాలి. ఏదైనా నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితే అప్పుడు ఈ 99 శాతం రూల్ అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు.

## అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థుల అవగాహన ర్యాలీ




**హైదరాబాద్-నవభూమి:**ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా, అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ హిమాయత్ నగర్ బ్రాంచ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలలో AIDS వైరస్ దాన్ని వ్యాప్తి మార్గాలు నివారణపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై ఎస్ ఎస్ సావిత్రి దేవి వివరించారు. కళాశాల ప్రాంగణం నుండి 100కు పైగా విద్యార్థులతో మొదలైన ర్యాలీ లిబర్టీ సర్కిల్ వరకు కొనసాగింది. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వినియోగదారులకు షాక్ ఇచ్చిన చమురు కంపెనీలు.. వరుసగా ఐదోసారి సిలిండర్ ధర పెంపు..

**న్యూఢిల్లీ-నవభూమి:** చమురు కంపెనీలు కొనుగోలుదారులకు షాక్




ఇచ్చాయి. వాణిజ్య సిలిండర్ ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.16.50 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుంచి అమలులోకి వచ్చాయి. పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1818.50కి పెరిగింది. ధరలు పెరుగడం వరుసగా ఇది ఐదోసారి. అలాగే, ఐదు కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధరపై రూ.4 వరకు పెంచింది. ఇక గృహ వినియోగ 14.2 కిలోల సిలిండర్ ధరలను మాత్రం పెంచలేదు. గత నెలల ప్రారంభంలో కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ లిండర్ ధరను రూ.62 పెంచగా.. అక్టోబర్ 1న రూ.48.5 పెరిగి రూ.1,740కి చేరింది. ఆగస్ట్ 1న సిలిండర్‌పై రూ.6.5 పెరిగింది. సెప్టెంబర్ 1న రూ.39 పెరిగింది. ఇప్పటికే పెరిగిన ధరలతో అందరూ ఇబ్బందులుకు గురవుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో సిలిండర్ల ధరల పెంపుదలతో ఎల్‌పీజీపై ఆధారపడే వాణిజ్య సంస్థలు, చిరువ్యాపారులపై భారీగా ప్రభావం పడే అవకాశం ఉన్నది. కమర్షియల్ ఎల్‌పీజీ ధరలు పెరిగినప్పటికీ డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలో మార్పులు చేయకపోవడం స్వల్పంగా ఊరటనిచ్చినట్లయ్యింది. అంతర్జాతీయ చమురు ధరల ట్రెండ్‌కు అనుగుణంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరను ఆదివారం 1.45 శాతం పెంచారు. దేశ రాజధానిలో ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (%ూుఖీ%) ధర కిలోలీటర్‌కు రూ.1,318.12 పెరిగి రూ.91,856.84కి చేరింది. తాజాగా పెరిగిన ధరలతో కోల్?కతాలో రూ.1927, ముంబయిలో రూ.1771, చెన్నైలో రూ.1980, హైదరాబాద్‌లో రూ.2066 పలుకుతున్నది. ఇక డొమెస్టిక్ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.803 ఉండగా.. ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.603కే అందుబాటులో ఉంది. ముంబయిలో రూ.802.50, చెన్నైలో రూ.818.50, హైదరాబాద్‌లో రూ.855 వద్ద కొనసాగుతున్నది.

## 15 వరకు ఐటీ రిటర్న్ గడువు

**న్యూఢిల్లీ-నవభూమి:**గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు మరో 15 రోజులు పెంచింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు. ఈ




నిర్ణయంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నులు డిసెంబర్ 15 లోపు దాఖలు చేసుకోవచ్చును. ఆదాయ పన్ను చట్టం, 1961కి లోబడి సెక్షన్ 139(1) కింద ఐటీ రిటర్నుల గడువు తేదీని పెంచినట్లు వెల్లడించింది.

## నయా ఫండ్స్..

**న్యూఢిల్లీ-నవభూమి:**కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (కేఎంఏఎంసీ).. కోటక్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ట్రాన్స్‌పోర్టేషన్, లాజిస్టిక్స్ సహా ఇతర అనుబంధ రంగాల్లో ఉన్న కంపెనీలకు చెందిన ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ఈ పథకం ముగింపు తేదీ డిసెంబరు 9.

**ఇన్వెస్కో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్**

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇండియా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈక్విటీ, డెట్, గోల్డ్ ఈటీఎఫ్/సిల్వర్ ఈటీఎఫల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. కాగా అవకాశాలను బట్టి ఈ ఫండ్ తన నికర ఆస్తుల్లో 35 శాతం వరకు విదేశీ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే వీలుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడి (సిప్) రూపంలో అయితే కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

ఈ ఫండ్ ముగింపు తేదీ డిసెంబరు 11.

# పసిడి రుణాలకు ఫుల్ డిమాండ్: ఆర్బీఐ



**ముంబై-నవభూమి:** బంగారంపై రుణాలు తీసుకునే వారి సంఖ్య భారీగా పెరిగారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు, అత్యవసర అవసరాలకోసం బంగారమే పరమావధిగా కనిపిస్తున్నది. సామాన్యుడి నుంచి సంపన్నవర్గాల వరకు బంగారం ఉంటేచాలు బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలకాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కూడా ఈ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను కూడా నెలకొల్పాయి.

దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన ఏడు నెలల్లో(ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతం మేర పెరిగాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ 18, 2024 నాటికి పసిడి రుణాలు రూ.1,54,282 కోట్లుగా ఉన్నాయి. మార్చి 2024 నాటికి మొత్తం బంగారం రుణాలు రూ.1,02,562 కోట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైనదాంతో పోలిస్తే గోల్డ్ లోన్లు 56 శాతం అధికమయ్యాయి.

గడిచిన ఏడు నెలల్లో బంగారం రుణాలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయని, ఇందుకు ప్రధాన కారణం ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలు అన్‌సెక్యూర్డ్ లోన్ల కంటే సెక్యూర్డ్ లోన్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే పెరిగాయని బ్యాంకర్ వెల్లడించారు. అలాగే బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోవడంతో రుణ గ్రహీతలు బంగారాన్ని తాకట్టుపెట్టుకొని ఇతర రుణాలను తీర్చుకుంటున్నారని తెలిపారు. పసిడి రుణాల పాలసీలు, విధానాల్లో లోపాలు ఉంటే వచ్చే మూడు నెలల్లో సరిదిద్దుకోవాలని గత నెలలో రిజర్వు బ్యాంక్ అన్ని బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలకు సూచించింది.

**గృహ రుణాలు కూడా..**

బంగారం రుణాలతోపాటు గృహ రుణాలకు కూడా డిమాండ్ నెలకొన్నది. గత నెల చివరినాటికి దేశవ్యాప్తంగా రూ.28.7 లక్షల కోట్ల గృహ రుణాలు తీసుకున్నారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 12.1 శాతం పెరిగాయి. దీంతోపాటు క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాలు ఏడాది ప్రాతిపదికన 9.2 శాతం ఎగబాకి రూ.2.81 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆన్‌లైన్ ద్వారా జరిపే లావాదేవీలు అధికంగా ఉండటం ఇందుకు కారణమని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది.

**వ్యక్తిగత రుణాలకు దూరం**

బంగారం రుణాలతో పోలిస్తే వ్యక్తిగత రుణాలు తీసుకునేవారు తగ్గుముఖం పడుతున్నారు. ముఖ్యంగా ఈ రుణాలపై రిజర్వు బ్యాంక్ షరతులు విధించడంతో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఇవ్వడానికి జంకుతున్నాయి. ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా వ్యక్తిగత రుణాలు మొండి బకాయిలు అధికంగా ఉండటంతో సెంట్రల్ బ్యాంక్ పలు కీలక చర్యలు తీసుకున్నది. దీంతో వ్యక్తిగత రుణాలు 3.3 శాతం తగ్గాయని తెలిపింది. మొత్తంమీద బ్యాంకింగ్ రుణాలు 4.9 శాతం అధికమై రూ.172.4 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

## ఆమ్నెస్టీ స్కీంకు ఈపీఎఫ్ గ్రీన్‌సిగ్నల్.. క్లెయిం సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లింపులు

**న్యూఢిల్లీ-నవభూమి:**ఉద్యోగుల భవిష్యనిధి ఫండ్ ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఈపీఎఫ్‌వో చందాదారుడికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించడానికి రూపొందించిన ఆమ్నెస్టీ స్కీంకు ఈపీఎఫ్‌వో పచ్చజెండా ఊపింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈపీఎఫ్‌వో సెటిల్‌మెంట్ సమయంలో చేసే వడ్డీ చెల్లింపులను ఇకపై క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేదీ వరకు చెల్లించాలని నిర్ణయించింది.

ప్రస్తుత నిబంధనల ప్రకారం సెటిల్‌మెంట్ సమయంలో ఆ నెల 24వ తేదీ వరకు మాత్రమే వడ్డీ లెక్కించే విధానం ఉండగా.. ఇకపై సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లించనున్నారు. దీనివల్ల ఆర్థికంగా చందాదారుడికి ప్రయోజనం కలగడంతోపాటు ఫిర్యాదుల తగ్గుతాయని సీబీడీటీ అభిప్రాయ పడింది. దీంతోపాటు ఈ స్కీం ప్రయోజనాలు పొందేందుకు యజమానులు నుంచి ఒక సాధారణ ఆన్‌లైన్ డిక్లరేషన్ సర్టిఫికేట్ తీసుకుంటే సరిపోతున్నదని తెలిపింది. దీంతోపాటు ఆర్థిక భారం నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ భవిష్యనిధి సంస్థతో రిజిస్టర్ కాకపోయిన ఉద్యోగుల నిధులను డిపాజిట్ చేయకుండా ఎగవేతలకు పాల్పడే సంస్థలకు క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించింది.ఆయా సంస్థలు ఎలాంటి పెనాల్టీ ఎదుర్కొకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చి వివరాలు వెల్లడించే అవకాశాన్ని కల్పించింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రకటించిన ఎంప్లాయి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీంనకు ఈ పథకం సహాయపడనున్నది. అలాగే ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్(ఈడీఎల్ఐ) స్కీంకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ స్కీం కింద చందాదారుడు మరణిస్తే రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బీమా పరిహారం లభించనున్నది.

**మళ్లీ ఈక్విటీలో పెట్టుబడులకు అనుమతి**

మళ్లీ ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడానికి ఈపీఎఫ్‌వో బాడీ అనుమతినిచ్చింది. గతంలో ఈక్విటీలో పెట్టుబడులను తిరిగి ఈక్విటీల్లో పెట్టుబడి ప్రతిపాదనలకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కనీసంగా ఐదేండ్లపాటు ఈ పెట్టుబడులు అలాగే ఉండాలని, ప్రభుత్వ సెక్యూరిటీలు, సీపీఎస్ఈ, భారత్ 22లో పెట్టనున్నది. ఆటో క్లెయిం సెటిల్‌మెంట్ సదుపాయాన్ని రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెంచింది. గృహాలు, వివాహం, విద్యకు సంబంధించి రుణాలు తీసుకునేవారికి ఇది వర్తించనున్నది.

## ఈ నెలలో 17 రోజులు బ్యాంకులు క్లోజ్.. ఎప్పుడెప్పుడంటే..




**ముంబై-నవభూమి:**ప్రతి నెల మాదిరిగానే ఈసారి కూడా బ్యాంకు సెలవుల జాబితా వచ్చేసింది. అయితే ఈసారి డిసెంబర్ 2024లో 17 రోజుల పాటు బ్యాంకులు బంద్ ఉంటాయి. జాతీయ, స్థానిక పండుగలు, ఇతర కారణాల వల్ల బ్యాంకులకు సెలవులు ఉంటాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన క్యాలెండర్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పండుగలకు సెలవులు ఉన్నాయి. ప్రతి ఆదివారం, రెండో, నాల్గో శనివారం కూడా అన్ని బ్యాంకులు మూసివేయబడతాయి. ఈ వారపు సెలవులతో కలిపి ఈ నెల 17 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. ఆ వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.

ఈ రోజుల్లో బ్యాంకులు మూసివేయబడతాయి

డిసెంబర్ 1: ఆదివారం దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు

డిసెంబర్ 3: సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ పండుగ సందర్భంగా గోవాలో సెలవు

డిసెంబర్ 10: మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవు

డిసెంబర్ 11: అన్ని బ్యాంకులకు సెలవు

డిసెంబర్ 12: మేఘాలయలో పటోగన్ నెంగ్మింజా సంగ్మా సందర్భంగా బ్యాంకులు మూసివేయబడతాయి

డిసెంబర్ 18 : యు సోసో థామ్ వర్ధంతి సందర్భంగా మేఘాలయ, చండీగఢ్‌లో బ్యాంకులు మూసివేయబడతాయి

## ఎలక్ట్రిక్ వాహనాలపై మహీంద్రా అండ్ మహీంద్రా కీలక ప్రకటన.. అన్ని సేవలు ఒకే దగ్గర



**న్యూఢిల్లీ-నవభూమి:**మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎలక్ట్రిక్ వాహన శ్రేణిపై కీలక ప్రకటన చేసింది. ఎలక్ట్రికల్ వాహనాలను విక్రయించేందుకు కూడా ప్రస్తుతం ఉన్న సేల్స్ నెట్ వర్క్ నే ఉపయోగించుకోనున్నట్టు సంస్థ ప్రకటించింది. ఈ దిగ్గజ వాహన తయారీదారు సంస్థ తమకు చెందిన అన్ని వాహనాలను ఒకే నెట్ వర్క్ కింద అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తోంది. ఈ మేరకు సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెల్లడించారు. థార్, స్కార్పియో వంటి మోడళ్లను విక్రయించే ముంబైకి చెందిన ఈ ఆటోమేజర్.. ఇప్పుడు రెండు సరికొత్త గ్రౌండ్ అప్ మోడల్స్ ను సైతం మార్కెట్లోకి తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఒకటి బీఈ 6ఈ కాగా.. మరొకటి ఎక్స్ ఈవీ 9ఈ. కొత్తగా తీసుకువచ్చిన ఈ మోడల్స్ తో తమ ఎలక్ట్రికల్ వాహన శ్రేణిని పెంచుకుంది. ఇక ఈవీ సేల్స్ నెట్ వర్క్ పై మాట్లాడుతూ..

కంపెనీ తన ఈవీ శ్రేణి కోసం ప్రత్యేక సేల్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడాన్ని కూడా పరిశీలిస్తుందా అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. "మేము సేల్స్ కి సంబంధించిన అన్ని ఎంపికలను ఒకే చూరు కింద కస్టమర్లకు అందించాలని అనుకుంటున్నాం అని మహీంద్రా అండ్ మహీంద్రా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో రాజేష్ జెజురికర్ తెలిపారు. ప్రత్యర్థి టాటా మోటార్స్ సైతం ఈవీ మోడళ్లను విక్రయించడానికి ప్రత్యేక విక్రయ ఛానెల్‌ను ఏర్పాటు చేసింది.కొత్తగా ప్రవేశపెట్టిన ఈవీ మోడల్స్.. బీఈ 6ఈ , ఎక్స్ ఈవీ 9ఈ డెలివరీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి మధ్యలో ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ కంపెనీ ఒక ఎలక్ట్రిక్ మోడల్ ఎక్స్ యూవీ 400ను విక్రయిస్తోంది. ఈవీల కోసం ప్రత్యేక సేల్స్ నెట్‌వర్క్ లేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ, జెజురికర్ ఇలా అన్నారు.. "ఒక కస్టమర్ మా అవుట్‌లెట్‌లోకి రావాలంటే, వారు మా అన్ని ఉత్పత్తులను చూడాలి. తద్వారా వారు నచ్చిన దాన్ని ఎంచుకోవచ్చు. ఇలా కొన్నిసార్లు ఒకటి కంటే ఎక్కువ తీసుకుంటారు (మోడల్ ). కాబట్టి ఇది డిమాండ్‌ను పెంచుకునే అవకాశం ఉంది" అని తెలిపారు.

## పన్ను తగ్గింపుతో కంపెనీలకు రూ.3 లక్షల కోట్లు ఆదా!

**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ప్రభుత్వం 2019లో కార్పొరేట్ పన్ను తగ్గించడంతో గడిచిన ఐదేళ్లలో దేశీయ కార్పొరేట్ రంగానికి పన్ను చెల్లింపుల రూపంలో రూ.3 లక్షల కోట్ల వరకు ఆదా అయి ఉండవచ్చని నిపుణుల అంచనా. అందులో బడా కంపెనీలకే (బీఎసఈ 500 సూచీ నమోదిత సంస్థలు) అధిక ప్రయోజనం చేకూరిందని వారన్నారు. గడిచిన దశాబ్ద కాలంలో (2012-13 నుంచి) పలు పన్ను మినహాయింపుల ద్వారా కార్పొరేట్ రంగానికి చేకూరిన రూ.8 లక్షల కోట్లకు పైగా లబ్ధికి ఇది అదనమని వారన్నారు. అప్పటివరకు కల్పిస్తూ వచ్చిన ప్రోత్సాహకాలను హేతుబద్ధీకరించడంతో పాటు దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలను, కంపెనీల పోటీ సామర్థ్యాన్ని పెంచేందుకు కార్పొరేట్ పన్నును తగ్గించినట్లు ప్రభుత్వం సమర్థించుకుంది. కానీ, ఆ తర్వాత మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా గణనీయంగా తగ్గిందని.. దాంతో ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించగలిగే సామర్థ్యాన్ని పరిమితం చేసిందన్నారు. 2019 సెప్టెంబరు 20న మోదీ సర్కారు అప్పటికే మనుగడలో ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 22 శాతానికి.. కొత్త మాన్యుఫాక్చరింగ్ కంపెనీలకు 25 శాతం నుంచి 15 శాతానికి తగ్గించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంతో ముగిసిన ఐదేళ్లలో కంపెనీల లాభాలు 10.4 శాతం చొప్పున వృద్ధి చెందగా.. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లలో కంపెనీల లాభాలు 32.5 శాతం పెరిగాయి. మరీ ముఖ్యంగా 2020-21లో కొవిడ్ సంక్షోభం వ్యాపారాలను కుదిపేసినప్పటికీ సంస్థల లాభాలు వేగంగా పెరగడం గమనార్హం. కాగా, గత ఐదేళ్లలో కార్పొరేట్ల పన్ను చెల్లింపులు మాత్రం 18.6 శాతమే పెరిగాయి.

**26.5 శాతానికి తగ్గిన కార్పొరేట్ పన్ను ఆదాయం వాటా**

2017-18 ఆర్థిక సంవత్సరానికి మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ ట్యాక్స్ వాటా దాదాపు 32 శాతంగా ఉండేది. ఆ తర్వాత కాలంలో కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతూ రాగా.. వ్యక్తిగత పన్ను ఆదాయం వాటా పెరుగుతూ వచ్చింది. 2024-25 బడ్జెట్ అంచనాల ప్రకారం.. మొత్తం పన్ను ఆదాయంలో ఈ విభాగ వాటా దశాబ్ద కనిష్ఠ స్థాయి 26.5 శాతానికి తగ్గనుంది. వ్యక్తిగత ఆదాయ పన్నుల వాటా 30.91 శాతానికి, జీఎస్‌టీ రెవెన్యూ వాటా 27.65 శాతానికి పెరగనుంది.

ఈ ప్రథమార్ధంలోనూ అంతే..కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) డేటా ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ప్రథమార్ధంలో (ఏప్రిల్-సెప్టెంబరు) మొత్తం పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం వృద్ధితో రూ.18.1 లక్షల కోట్లకు చేరుకోగా.. అందులో కార్పొరేట్ పన్ను రాబడి కేవలం 2.3 శాతం వృద్ధితో రూ.4.6 లక్షల కోట్లకు పరిమితమైంది.

## పసిడి ప్రియులకు ఊరట.. స్వల్పంగా తగ్గిన ధరలు



**ముంబై-నవభూమి:**దేశంలో గత కొన్ని రోజులుగా బంగారం వెండి ధరలలో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. డిసెంబర్ నెల రావడానికి ముందే భారీగా పెరిగిన ధరలు ఇప్పుడు క్రమంగా తగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మరోసారి బంగారం, వెండి ధరల్లో మార్పు చోటు చేసుకుంది. దీంతో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 120 రూపాయలు తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా కిలోకు 100 రూపాయలు తగ్గాయి. బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్లలో కొనసాగుతున్న ధోరణులతో పాటు దేశీయ ఆర్థిక విధాన నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి.

నేటి బంగారం, వెండి ధరలు ఇదే సమయానికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 78,000 స్థాయికి చేరింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 71,500కి చేరుకుంది. మరోవైపు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 78,150కి చేరుకోగా, 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములకు రూ. 71,650 స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్ల వివరాలను ఇప్పుడు చుద్దాం.

దేశంలో ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)

వడోదరలో రూ. 78,050, రూ. 71,550
ముంబైలో రూ. 78,000, రూ. 71,500
చెన్నైలో రూ. 78,000, రూ. 71,500
విజయవాడలో రూ. 78,000, రూ. 71,500
హైదరాబాద్‌లో రూ. 78,000, రూ. 71,500
కేరళలో రూ. 78,000, రూ. 71,500
ఢిల్లీలో రూ.78, 150, రూ. 71,650
బెంగళూరులో రూ. 78,000, రూ. 71,500
కోల్‌కతాలో రూ. 78,000, రూ. 71,500
పూణేలో రూ. 78,000, రూ. 71,500

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

ఢిల్లీలో రూ. 91,500
హైదరాబాద్‌లో రూ. 100,000
విజయవాడలో రూ. 100,000
చెన్నైలో రూ. 100,000
కోల్‌కతాలో రూ. 91,500
కేరళలో రూ. 100,000
ముంబైలో రూ. 91,500
బెంగళూరులో రూ. 91,500
భువనేశ్వర్‌లో రూ. 100,000
వడోదరలో రూ. 91,500
అహ్మదాబాద్‌లో రూ. 91,500

# ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్ పటేల్.. ఇండియన్ అమెరికన్‌కు ట్రంప్ కీలక బాధ్యతలు




**వాషింగ్టన్: -నవభూమి:**అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ వచ్చే నెలలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఈనేపథ్యంలో తన ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తన పరిపాలన టీమ్‌లోకి ఒక్కొక్కరిని తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులు కేటాయించారు. తాజాగా కశ్యప్ పటేల్‌కు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. దేశంలోనే అత్యంత ముఖ్యమైన దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌చీఫ్‌గా పటేల్‌ను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. 'ఎఫ్‌బీఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ పటేల్ వ్యవహరిస్తునందుకు నేను గర్విస్తున్నా. కాష్ గొప్ప లాయర్, పరిశోధకుడు. దర్యాప్తులో దిట్ట. అమెరికాలో అవినీతి నిర్మూలనకు, న్యాయాన్ని గెలిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్న అమెరికా ఫస్ట్ ఫైటర్. అమెరికా ప్రజల రక్షణలో ఆయన కృషి గొప్పది. ఆయన నియామకంతో ఎఫ్‌బీఐకి పునర్వైభవం తీసుకొస్తాం' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫాంలో వెల్లడించారు.

# అంతు చిక్కని 'మహాయుతి' నాడి.. పదవుల పంపకంపై కూటమిలో విభేదాలు!




**న్యూఢిల్లీ-నవభూమి:**మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి పదవుల పంపకంలో ఓ నిర్ణయానికి రాలేకపోతున్నది. ఉప ముఖ్యమంత్రికే హోం శాఖను ఇవ్వాలని శివసేన పట్టుబడుతున్నది. తమ నేత షిండేను పక్కనబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడుతున్నది. ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ మాత్రం బీజేపీకే ముఖ్యమంత్రి పదవి అని, ఎన్‌సీపీ, శివసేనలకు ఉప ముఖ్యమంత్రి పదవులు అని స్పష్టం చేశారు. అదే సమయంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైందని బీజేపీ ప్రకటించింది. మరోవైపు మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మొత్తానికి మహాయుతి రాజకీయాలు అంతు చిక్కకుండా ఉన్నాయి.

శివసేన(షిండే వర్గం) నేత సంజయ్ శిర్సట్ శనివారం మాట్లాడుతూ..ఉప ముఖ్యమంత్రికే హోం మంత్రి పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే హోం మంత్రి పదవిని నిర్వహించడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు చాలా కాలం నుంచి అమల్లో ఉన్నప్పటికీ, వాటికి షిండే కొత్త ఊపును తెచ్చారని, అందుకే ఎన్నికల్లో కూటమి పక్షాలకు సత్ఫలితాలు లభించాయని చెప్పారు. మరో రెండున్నరేండ్లు ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే, మరింత ఎక్కువ కృషి చేసి ఉండేవారన్నారు. అటువంటి షిండేను పక్కన బెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మరాఠా కోటా ఉద్యమకారులకు నచ్చ చెప్పే బాధ్యతను షిండే తన భుజస్కంధాలపై వేసుకున్నారని చెప్పారు. ఆయన మరాఠా రిజర్వేషన్ కూడా ఇచ్చారని, అందుకే ఆయనకు మద్దతు పెరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి మాఝీ లడ్కి బహిన్ పథకం ప్రభావం ఎన్నికల్లో మహాయుతిపై స్పష్టంగా కనిపించిందన్నారు.

సంజయ్ శుక్రవారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పేరును బీజేపీ అధిష్ఠానం శుక్రవారం అర్ధరాత్రికి ప్రకటిస్తుందనే సమాచారం ఉందన్నారు. ఆ తర్వాతి 24 గంటల్లో ఏక్‌నాథ్ షిండే చాలా పెద్ద నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మరోవైపు మహాయుతి 2.0 ప్రభుత్వం గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తుందని మహారాష్ట్ర బీజేపీ శాఖ చీఫ్ చంద్రశేఖర్ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**శివసేన, ఎన్సీపీలకు డిప్యూటీ సీఎం పోస్టులు**

ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్‌కు కొంత వరకు తెరదించారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి బీజేపీకేనని స్పష్టం చేశారు. మహాయుతిలోని శివసేన, ఎన్‌సీపీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు వస్తాయని చెప్పారు.

**సీఎం రేసులో ముందంజలో ఫడ్నవీస్**

బీజేపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఆయన రెండుసార్లు ముఖ్యమంత్రిగా, గత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు.


ఏక్‌నాథ్ షిండేకు అస్వస్థత

మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన(షిండే వర్గం) చీఫ్ ఏక్‌నాథ్ షిండే అస్వస్థతతో బాధ పడుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సతారా సివిల్ సర్జన్ యువరాజ్ కార్వే మాట్లాడుతూ, షిండే శ్వాస నాళం ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారని తెలిపా రు. ఆయనకు నీరసం, జ్వరం, గొంతులో దురద ఉన్న ట్లు చెప్పారు. పల్స్ రేటు, బీపీ సాధారణంగా ఉన్నాయన్నారు. నీరసంగా ఉన్నందువల్ల రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

**విచ్ఛిన్నం దిశగా!**

మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యమంత్రి పదవిని దేవేంద్ర ఫడ్నవీస్‌కు కట్టబెట్టడాన్ని ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, సీఎం పదవిని ఇవ్వకపోయినా, శాంతి భద్రతలతో సహా హోం శాఖను పూర్తిగా తమకే ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారని చెప్తున్నారు. దీనికి బీజేపీ పెద్దలు ససేమిరా అనడంతో ఆయన అలిగి, అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని, సొంతూరుకు వెళ్లిపోయారని అంటున్నారు. మహాయుతితో తెగదెంపులు చేసుకోవాలని శివసేన నేతలు ఆయనకు సలహా ఇస్తున్నట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది.


## మనుషులను మెషీన్లతో భర్తీ చేయాలనుకుంటున్నారు: ఏఐ పితామహుడు యోషువా



**మాంట్రియల్-నవభూమి:** కొందరు శక్తిమంతులు మనుషులను ఏఐ ద్వారా భర్తీ చేయాలని కోరుకుంటున్నారని కెనడా కంప్యూటర్ శాస్త్రవేత్త, 'ఏఐ పితామహుడి'గా గుర్తింపు పొందిన యోషువా బెంగియో పేర్కొన్నారు. టెక్ దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏఐతో పొంచి ఉన్న ప్రమాదంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'జ్ఞానం శక్తిని ఇస్తుంది. ఆ శక్తిని దుర్వినియోగం చేయాలనుకునే వారు ఉన్నారు.మనుషులను యంత్రాలు భర్తీ చేయడాన్ని చూసి ఆనందించే వారూ ఉన్నారు.' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తులు గుప్పెడు మందే ఉన్నప్పటికీ, వారు శక్తిమంతులని అన్నారు. వెంటనే సరైన పరిమి తులను విధించకపోతే వారు ఈ పనిని చేయగలరని హెచ్చరించారు. ఏఐ రంగంలో పెరుగుతున్న శక్తిని అదుపు చేయడానికి ప్రపంచ నాయ కులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని, దీనిపై అంతర్జాతీయ విధానం తీసుకు రావాలని అన్నారు. మానవ మేధస్సు స్థాయిని ఏఐ ఎప్పుడూ సాధిస్తుందో ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు.

## బాబోయ్ ఈ యుద్ధం మాకొద్దు

### గగ్గోలు పెడుతున్న ఉక్రెయిన్ సైన్యం



**కీవ్-నవభూమి:**సుమారు మూడేండ్లుగా రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ముగిసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్ సైనికులు చాలామంది 'బాబోయ్ ఈ యుద్ధం మాకొద్దు' అంటూ యుద్ధభూమి నుంచి కాలికి బుద్ధి చెబుతున్నారు. ఒక పక్క కాల్పుల విరమణకు ప్రయత్నాలు సాగుతున్న క్రమంలో గట్టిగా తమ డిమాండ్లపై బేరం ఆడే స్థితిలో ఉక్రెయిన్ లేదని వారు భావిస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 2 లక్షల మంది సైనికులు సైన్యం నుంచి పారిపోయినట్టు అంచనా. కొంతమంది విధులకు గైర్హాజరై పరారవ్వగా, మరికొందరు అనారోగ్య కారణాలతో సెలవులు పెట్టి తిరిగి విధుల్లోకి చేరకపోవడం తో వారి సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. తమకు సరిపడా ఆయుధ సంపత్తి కూడా లేదని వారు అంటున్నారు. దీంతో భూతల దాడిలో ఆ దేశం మరింత బలహీనంగా మారుతున్నది.

**అలా చేస్తే కాల్పుల విరమణకు ఓకే: జెలెన్‌స్కీ**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. కీవ్ ఆధీనంలో ఉన్న భూ భాగాన్ని నాటో పరిధిలోకి తెస్తే కాల్పుల విరమణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. స్కైన్యూస్‌కు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'వేడిగా సాగుతున్న ఈ యుద్ధం దశను ఆపాలంటే మా నియంత్రణలో ఉన్న ఉక్రెయిన్ భూ భాగాన్ని నాటో పరిధిలోకి తేవాలి. అలా జరిగితేనే రష్యా ఆక్రమించుకున్న మా ప్రాంతాన్ని దౌత్యమార్గంలో సాధించుకోవచ్చు. మేము వేగంగా చేయాల్సిందే అదే' అని పేర్కొన్నారు. అయితే నాటోలోని ఏ దేశం కూడా తమతో ఇలాంటి ప్రతిపాదన తీసుకురాలేదని అన్నారు. దేశంలోని ఒక భూ భాగానికి మాత్రమే రక్షణ ఏర్పాటు చేయడం నాటోకు కూడా కష్టమేనని పేర్కొన్నారు. తమను నాటోలో చేర్చుకోవడం కష్టమేనని, అలాంటి ప్రతిపాదనేదీ కూడా రాలేదన్నారు.

**యుద్ధానికి తెర పడుతుందా?**

అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చలకు తాను సిద్ధమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించిన క్రమంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడవచ్చునని భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న శత్రుత్వాన్ని ముగిస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు జెలెన్‌స్కీ కూడా కొత్త ప్రతిపాదనలతో కాల్పుల విరమణకు ఓకే చెప్పడంతో యుద్ధం ముగియవచ్చు.

# బ్యాంక్‌కు బుద్ధి చెప్పేందుకు రూ.295 కోసం ఏడేళ్లు న్యాయపోరాటం



**న్యూఢిల్లీ-నవభూమి:**రూ.295 కోసం ఏడేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న ఒక వ్యక్తి చివరకు తాను అనుకున్నది సాధించాడు. అన్యాయంగా తన ఖాతా నుంచి రూ.295 కట్ చేసిన అంశాన్ని ప్రశ్నించటమే కాదు.. బ్యాంక్ కు బుద్ధి చెప్పాలని డిసైడ్ అయిన ఈ ఉదంతం చివరకు బాధితుడికి ఊరట కల్పించేలా వినియోగదారుల ఫోరం నిర్ణయం తీసుకుంది. ఇంతకూ ఈ వ్యవహారం ఎక్కడ జరిగింది? అసలేం జరిగింది? అన్న వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్ లోని జబల్ పుర్ జిల్లాకు చెందిన పనాగర్ కు చెందిన నిశాంత్ తామ్రకార్ అనే వ్యక్తి వాషింగ్ మెషిన్ ను కొనుగోలు చేశారు. ఇందుకోసం ఈఎంఐ ఆప్షన్ ను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా మొదటి ఈఎంఐ కింద డెబిట్ కావాల్సిన మొత్తం కంటే రూ.295 కట్ అయ్యింది. దీనిపై ఆయన బ్యాంక్ అధికారుల్ని సంప్రదించారు.చెక్ డిడక్షన్ ఛార్జీగా బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు. తగినంత మొత్తాన్ని తన బ్యాంక్ ఖాతాలో ఉంచుతానని.. చెక్ బౌన్స్ కావటానికి అవకాశమే లేదని పేర్కొన్నారు. తన ఖాతా నుంచి డెబిట్ చేసిన రూ.295 మొత్తాన్ని తన ఖాతాలో క్రెడిట్ చేయాలని బ్యాంక్ సిబ్బందిని కోరగా.. అందుకు వారు ససేమిరా అన్నారు. దీంతో.. బ్యాంక్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. ఇందుకోసం నిబంధనల ప్రకారం రూ.3వేల మొత్తాన్ని డిపాజిట్ చేసిన నిశాంత్, జబల్ పుర్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. 2017లో మొదలైన ఈ కేసు ఇప్పటివరకు కంటిన్యూ అవుతోంది. ఏడేళ్ల అనంతరం తాజాగా వినియోగదారుల ఫోరం నిశాంత్ కు అనుకూలంగా తీర్పును ఇచ్చింది. వినియోదారునికి రూ.295తో పాటు రూ.4వేల మొత్తాన్ని పరిహారంగా చెల్లించాలని బ్యాంక్ కు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన నిశాంత్.. తాను డబ్బుల కోసం ఇదంతా చేయలేదని.. వినియోగదారుగా తన హక్కుల రక్షణ కోసమే ఈ ఫైట్ చేసినట్లుగా పేర్కొనటం

# పిల్లలకు సోషల్ మీడియా నిషేధం...

## మస్క్‌కు ఇచ్చి పడేసిన ఆస్ట్రేలియా ప్రధాని!



**న్యూఢిల్లీ-నవభూమి:**సోషల్ మీడియా విషయంలో ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా బిల్లు తీసుకొచ్చారు. త్వరలో ఇది చట్టం కాబోతుంది. అనంతరం సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ కు ఆ మేరకు టెక్నికల్ ఇష్యూస్ సెట్ చేసుకోవడానికి ఏడాది సమయం ఇవ్వనున్నారు! ఈ నిర్ణయాన్ని చాలా మంది అభినందిస్తున్నారు. దీనికి భారత్ లోని పలువురు ప్రముఖులు స్వాగతిస్తున్నారు. భారత్ లోనూ ఇలాంటి నిర్ణయం దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దీంతో.. వీటిని ఆస్ట్రేలియా ఖండించింది. అవును... ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా బిల్లు తీసుకురావడంపై ఎలాన్ మస్క్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆస్ట్రేలియాలో ఇంటర్నెట్ యాక్సెస్ ను నియంత్రించడానికి ఈ నిషేధం బ్యాక్ డోర్ లా ఉందని మస్క్ విమర్శించారు. ఈ విమర్శలను ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్ తప్పుబట్టారు. ఇందులో భాగంగా... ఎలాన్ మస్క్ ఓ అజెండాను కలిగి ఉన్నారని.. ఆయన ఎక్స్ యజమాని అవ్వడం వల్ల దాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారని.. సోషల్ మీడియా నిర్ణయంపై ఎవరితోనైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీంతో... మస్క్ ను ఆంటోనీ ఆల్బనీస్ గట్టిగానే తగులుకున్నారనే చర్చ మొదలైంది. కాగా... ఆస్ట్రేలియా ప్రభుత్వం ఆమోదించిన ఈ బిల్లుకు సెనెట్ ఆమోదం తెల్లిపితే చట్టరూపం దాల్చనున్న సంగతి తెలిసిందే. ఒక వేళ ఈ నిబంధనలను సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు ఉల్లంఘిస్తే వారిపై 50 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (దాదాపు రూ.273 కోట్లు) జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

## బంగ్లాలో కొనసాగుతున్న మత వ్యతిరేక అల్లర్లు..

**ఢాకా -నవభూమి:** బంగ్లాదేశ్‌లో హిందూ మత వ్యతిరేక అల్లర్లు కొనసాగుతున్నాయి. తాజాగా పోర్ట్ సిటీ చిట్టగ్యాంగ్‌లోని హరీశ్‌చంద్ర మున్సఫ్ లేన్‌లో ఉన్న శంతనేశ్వరి మాత్రి ఆలయంతోపాటు సమీపంలోని సోనీ ఆలయం, శంతనేశ్వరి కలిబరీ ఆలయాలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు శుక్రవారం దాడి చేసి ధ్వంసం చేశారు. వందలాది మంది ఆందోళనకారులు హిందూ, భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఇటుకలతో ఆలయాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. అయితే, పోలీసులు మాత్రం ఈ ఘటనను తేలిగ్గా తీసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఇటుకలు విసురుకునే క్రమంలో ఆలయాలు స్వల్పంగా దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. మిలటరీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చింది. మరోవైపు ఇస్కాన్‌కు చెందిన హిందూ పూజారి శ్యామ్ దాస్, మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరెస్టయిన హిందూ, ఇస్కాన్ నేత చిన్మయ్ కృష్ణ దాస్‌ను కలిసేందుకు జైలుకు వెళ్లిన సమయంలో శ్యామ్ దాస్‌ను, మరో వ్యక్తిని అరెస్టు చేశారని, అలాగే కృష్ణ దాస్ కార్యదర్శి కూడా అదృశ్యం అయ్యారని ఇస్కాన్ కోల్‌కతా అధికార ప్రతినిధి రాధారామన్ దాస్ తెలిపారు. దీనిపై బంగ్లాదేశ్ అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు భైరవ్‌లో ఉన్న ఇస్కాన్ కేంద్రంలో కొందరు దుండగులు విధ్వంసం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియోను రాధారామన్ దాస్ ట్వీట్ చేశారు.

**'బంగ్లా దేశీయులకు వైద్యం చేయం'**

ఇక నుంచి బంగ్లాదేశ్‌కు చెందిన వారికి చికిత్స చేయొద్దని కోల్‌కతాలోని జేఎన్ రే దవాఖాన నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు, భారత దేశ జెండాను అవమానించిన ఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు దవాఖాన అధికారి సుభ్రాంశు భక్త్ వెల్లడించారు.

**మా ఆందోళనలను భారత్ పరిష్కరించాలి**

ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు ఢాకా దీర్ఘకాల ద్వైపాక్షిక ఆందోళనలను భారత దేశం పరిష్కరించాల్సి ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సత్సంబంధాలపై తాము ఇంకా ఆశాజనకంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఇస్కాన్ నేత కృష్ణదాస్ అరెస్ట్‌తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బంగ్లా విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హొస్సేన్ మాట్లాడారు. ఆగస్టు 5 తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాల మధ్య మార్పు చోటుచేసుకున్న మాట వాస్తవమేనన్నారు.

అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు

బంగ్లాలో హిందూ నేత అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని, అతడిని ఒక నిర్దేశిత ఆరోపణలతో అరెస్ట్ చేసినట్టు బంగ్లాదేశ్ సమర్థించుకుంది. యూఎన్ ఫోరమ్‌లో మైనారిటీల సమస్యలపై నిర్వహించిన సమావేశం సందర్భంగా జెనీవాలోని ఐరాస బంగ్లాదేశ్ శాశ్వత ప్రతినిధి, దౌత్యవేత్త తెరిక్ ఎండీ ఆరిఫుల్ ఇస్లామ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై ఎలాంటి క్రమబద్ధమైన దాడి జరగలేదని హిందూ నేత అరెస్ట్ అంశం తమ న్యాయస్థానం పరిధిలో ఉందని ఆయన స్పష్టం చేశారు.

## కారును ఢీకొట్టిన ట్రక్కు.. ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. రాయ్‌పూర్ నుంచి అంబికాపూర్ వెళ్తున్న కారును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో నలుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సుర్గుజా జిల్లా అంబికాపూర్ బిలాస్‌పూర్ జాతీయ రహదారి 130పై ఉదయపూర్ సమీపంలో ప్రమాదం చోటు చేసుకున్నది. ప్రమాతం తర్వాత ట్రక్కు డ్రైవర్ తప్పించుకునేందుకు కార్‌ని రివర్స్ చేయగా.. కారు మరింత దెబ్బతింది. మృతులను చంగురభతా రాయ్‌పూర్ వాసులుగా గుర్తించారు. జగదల్‌పూర్‌కు కారులో బయలుదేరగా.. ఉదయపూర్ అదానీ గెస్ట్ హౌస్ సమీపంలో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను కట్టర్ల సహాయంతో తొలగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్ మీద విషం కక్కుతున్న బంగ్లాదేశ్!




**బంగ్లాదేశ్ -నవభూమి:**బంగ్లాదేశ్ అన్నది ఈ రోజున ప్రపంచ మ్యాప్ లో ఉంది అంటే దానికి కారణం భారత దేశం. ఆ విషయం రాజకీయాల మీద అవగాహన ఉన్న వారు ఎవరైనా చెబుతారు. పాకిస్తాన్ ఏర్పడ్డాక అందులో తూర్పు పాకిస్తాన్ కి చెందిన వారి పట్ల వివక్ష చూపిస్తున్నారని వారిని అధికార పీఠం మీద కూర్చోనీయకుండా కుట్రలు చేస్తున్నారని ద్వితీయ శ్రేణి పౌరులుగా ట్రీట్ చేస్తున్నారని ఒక పాతికేళ్ల పాటు నలిగిన తరువాత వారు ప్రత్యేక దేశం డిమాండ్ అందుకున్నారు. అలా డెబ్బై దశకం తొలి నాళ్ళలో పుట్టిన ఉద్యమం కాస్తా పాకిస్తాన్ మీద తూర్పు పాకిస్థాన్ నేతలు యుద్ధం ప్రకటిస్తే వారిని అణచేందుకు పాకిస్తాన్ సహజంగానే తన ప్రయత్నాలను చేసింది. అప్పటికే చాలా వరకూ అణచేస్తూ అన్యాయం చేస్తూంటే తూర్పు పాకిస్థాన్ వారు భారత్ ని మద్దతు కోరిన మీదట నాటి దేశ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ భారత జవాన్లను పంపించి పాకిస్తాన్ మీద వీరోచిత యుద్ధాన్ని చేయించారు. మన క్రికెటర్ల ఫోబియాలు ఆనాడు తూర్పు పాకిస్తాన్ వారిని ఆదుకున్నారు. భారత జవాన్లు లాహోరు దాకా వెళ్ళి మరీ పాక్ పీచమణచారు. పాకిస్తాన్ సైన్యాన్ని బంధీలుగా పట్టి తెచ్చారు. పాక్ ని ఓడించి మరీ దారికి తెచ్చారు. అలా ఏర్పడినదే బంగ్లాదేశ్. రెండేళ్ళ క్రితమే యాభై ఏళ్ళు పూర్తి చేసుకున్న బంగ్లాదేశ్ వెనక ఉన్న బలమైన శక్తి భారత్. ఈ రోజున సర్వ స్వతంత్ర దేశంగా ఉంటూ ప్రపంచంలో తలెత్తుకుని తిరుగుతోంది అంటే దానికి కారణం భారత్. ఆ విధంగా చేయడమే కాదు భారత్ ఆర్థికంగా ఇతరత్రా బంగ్లాదేశ్ కి చేదోడు వాదోడుగా ఉంటూ ఆ దేశం ఇంతటి స్థాయికి రావడానికి ప్రపంచ స్థాయిలో ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి భారత్ కారణం అన్నది తెలిసిన విషయం. అలాంటి బంగ్లాదేశ్ ఈ రోజు భారత్ మీద విషం కక్కుతోంది. బంగ్లాదేశ్ లో హిందువుల మీద దాడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అక్కడ టార్గెట్ చేసి మరీ హిందూ లీడర్ల మీద ధార్మిక సంస్థల మీద ఆధ్యాత్మికవేత్తల మీద దాడులు చేస్తున్నారు. వారి బ్యాంక్ అకౌంట్లను స్పందింపచేస్తున్నారు. వారి మీద అన్ని రకాలుగా ఎటాక్ జరుగుతోంది. అయినా సరే బంగ్లా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అక్కడ ప్రస్తుతం ఉన్నది తాత్కాలిక ప్రభుత్వం. దాంతో ఆ ప్రభుత్వం పూర్తిగా పాక్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది అని అంటున్నారు. అంతే కాదు భారత్ ని శతృవుగా చూస్తోంది అన్న మాట ఉంది. అమెరికా కొత్త ప్రెసిడెంట్ గా నెగ్గిన ట్రంప్ సైతం బంగ్లాలో హిందువుల మీద దాడులను ఖండించారు. ఇతర దేశాల వారూ రియాక్ట్ అవుతున్నారు. అయినా సరే బంగ్లాదేశ్ లో మాత్రం అంతకంతకు హిందువుల పరిస్థితి దారుణంగానే ఉంది. వారి మీద జరుగుతున్న దాడుల గురించి బయట ప్రపంచానికి తెలిసింది తక్కువ. అక్కడ జరుగుతున్నదే ఎక్కువ అని అంటున్నారు. ఇదంతా దేని కోసం ఎవరి మెప్పు కోసం అన్న చర్చ సాగుతోంది. మత సామరస్యాన్ని కాపాడుతూ వచ్చిన షేక్ హసీనాను కూలదోసిన శక్తులే ఇపుడు తాత్కాలిక ప్రభుత్వం వెనకాల ఉండి ఆడిస్తున్నాయని వారి అసలు లక్ష్యం భారత్ అని అర్థం అవుతోంది అంటున్నారు. భారత్ బంగ్లాదేశ్ కి ఎపుడూ శతృవు కాదు అన్నది తెలిసిందే. వారి దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకున్నదీ లేదు. కాకినాడ పోర్టుపై కీలక విషయాలు! ఎవరు అక్కడ ఉన్నా భారత్ స్నేహ హస్తమే అందిస్తూ వచ్చింది. అలాంటిది భారత్ మీద పగ పెట్టడమేమిటని అంటున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బంగ్లాదేశ్ లో హిందువుల మీద దాడులను ఖండించింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే విడుదల చేసిన ఈ ప్రకటనలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. మైనార్టీలపై దాడుల అంశం మీద అక్కడి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆరోపించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఇస్కాన్ సంస్థ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని దత్తాత్రేయ హొసబలే డిమాండ్ చేశారు. అంతే కాదు వరసబెట్టి జరుగుతున్న హిందువులపై దౌర్జన్యాన్ని ఆపాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక బంగ్లా దేశంలో మైనార్టీలపై జరుగుతోన్న దాడులను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగించాలని కోరింది. ఈ దాడుల విషయంలో ప్రపంచ మద్దతు దిశగా చర్యలు చేపట్టాలని సూచించింది. మరో వైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, దేవాలయాలపై దాడులు, భారతీయ జెండాకు అవమానం నేపథ్యంలో ఆ దేశానికి చెందిన రోగులకు చికిత్స చేసేది లేదని కోల్‌కతాలోని జేఎన్ రే ఆసుపత్రి కీలక ప్రకటన చేసిది. బంగ్లాదేశీయులు భారతీయ జెండాను అవమానించారని, అక్కడి హిందువుల పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నందుకు గాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.



# మరో సినిమాతో వస్తోన్న ధృవ సర్జా.. కోర ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్

కన్నడలో సూపర్ ఫాలోయింగ్ ఉన్న యాక్టర్లలో ఒకడు ధృవ సర్జా . ఇటీవలే మార్టిన్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా మరో సినిమాతో అందరినీ పలుకరించేందుకు రెడీ అవుతున్నాడు. అయితే ఈ సారి మాత్రం హీరోగా కాకుండా నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్నాడు. ధృవ సర్జా సమర్పిస్తున్న తాజా ప్రాజెక్ట్ కోర. %యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ మూవీలో సునామీ కిట్టి, చరిష్మా, పి మూర్తి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. హీరో ముఖంపై గాట్లతో సీరియస్‌గా కనిపిస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు.

ఒరటాశ్రీ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ మరియు రత్నమ్మ మూవీస్ పతాకాలపై డాక్టర్ ఎబి నందిని, ఎఎన్ బాలాజీ, పి మూర్తి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఎంకే మాత, మునిరాజు, నీనాసం అశ్వత్‌లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.





# స్నేహితుడిని పెళ్లాడే ముందు చీరలో

జాతీయ అవార్డు గ్రహీత, యువనటి కీర్తి సురేష్ పెళ్లి గురించి గత కొన్ని నెలలుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎట్టకేలకు గుసగుసలే నిజమయ్యాయి. తన స్నేహితుడు అయిన దుబాయ్ బిజినెస్ మేన్ ఆంటోనిని కీర్తి పెళ్లాడేయబోతోంది. ఈ విషయాన్ని తనే స్వయంగా సోషల్ మీడియాల్లో ధృవీకరించింది. మీడియా ఊహాగానాలకు చెక్ పెడుతూ ఈ అధికారిక ప్రకటన అనంతరం కీర్తి శుక్రవారం తన తల్లిదండ్రులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామిని సందర్శించడానికి తిరుపతికి వెళ్లింది. కీర్తితో పాటు తన తల్లి మేనక, తండ్రి జి. సురేష్‌కుమార్ కూడా తిరుమలేశుని చెంత మొక్కు తీర్చుకోవడానికి విచ్చేశారు. ఈ డిసెంబర్ లోనే కీర్తి- ఆంటోని పెళ్లి జరగనుంది. అంతకంటే ముందే తన బాలీవుడ్ అరంగేట్రం కోసం ఆశీర్వాదం కోసం అక్కడకు వచ్చినట్లు కీర్తి తిరుమలలో విలేకరులకు తెలియజేసింది. కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనిని పెళ్లి చేసుకోవడం అధికారికం. ఆ ఇద్దరూ కాలేజీ రోజుల నుంచి ప్రేమించుకుంటున్నారని కథనాలొచ్చాయి. సినిమాల్లోకి వచ్చి స్టార్ హీరోయిన్ అయిన తర్వాత కూడా కీర్తి తన ప్రేమను కొనసాగించింది. 15 ఏళ్లుగా పరిచయం ఉన్న వీరిద్దరూ ఇప్పుడు పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. వచ్చే నెలలో నాకు పెళ్లి, నా హిందీ సినిమా కూడా త్వరలో విడుదల కానుంది.. అందుకే దేవుడి ఆశీస్సులు పొందేందుకు వచ్చాను. డిసెంబర్‌లో గోవాలో పెళ్లి జరగనుందని కీర్తి ధృవీకరించింది. డిసెంబర్ 11-12 తేదీల్లో గోవాలో కీర్తి పెళ్లి జరగనుంది. ఈ పెళ్లికి ముందు కీర్తి ఫోటోషూట్లు ఆసక్తికరంగా మారాయి. ఇటీవల కీర్తి కొన్ని బోల్డ్ ఫోటోషూట్లను సోషల్ మీడియాల్లో షేర్ చేసింది. దానికి భిన్నంగా కీర్తి ట్రెడిషనల్ శారీ లుక్ లను కూడా ఇప్పుడు షేర్ చేస్తోంది. తాజాగా కీర్తి నీలి రంగు డిజైనర్ శారీలో ప్రత్యక్షమైంది. ఈ ఫోటోగ్రాఫ్‌లో దేవతాసుందరిని తలపిస్తోంది. పెళ్లికి ముందు కీర్తి మూడ్ ని ఇది ఎలివేట్ చేస్తోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... కీర్తి సురేష్ త్వరలో బేబీ జాన్‌లో కనిపించనుంది. ఈ చిత్రానికి కలీస్ దర్శకత్వం వహించారు. వరుణ్ ధావన్, కీర్తి సురేష్, వామిక గబ్బి ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల కానుంది. మహానటి, దసరా, భోళా శంకర్ సహా పలు విజయవంతమైన చిత్రాల్లో కీర్తి నటించిన సంగతి తెలిసిందే.



# శ్రీవల్లి జోరు.. పార్ట్ 1 కి రూ.2 కోట్లు, పార్ట్ 2 కి రూ.10 కోట్లు?

పుష్ప సినిమాలో హీరోయిన్‌గా నటించిన రష్మిక మందన్న మరోసారి శ్రీవల్లిగా పుష్ప 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇటీవల ఒక చిట్ చాట్‌లో తన 8 ఏళ్ల సినీ కెరీర్‌లో అయిదు సంవత్సరాలు పుష్ప సినిమా కోసం వర్క్ చేసినట్లుగా చెప్పింది. మరో రెండేళ్లు పుష్ప 3 సినిమా కోసం ఈమె వర్క్ చేయాల్సి రావచ్చు. మొత్తానికి పుష్ప సినిమా కోసం శ్రీవల్లి పాత్రలో రష్మిక మందన్న చేస్తున్న హడావిడి సందడి అంతా ఇంతా కాదు. సోషల్ మీడియాలో రష్మిక మందన్న ఓ రేంజ్‌లో సందడి చేస్తూ ఉంది. పాన్ ఇండియా స్థాయిలో పుష్ప కారణంగా గుర్తింపు దక్కించుకుంది అనడంలో సందేహం లేదు. పుష్ప మొదటి పార్ట్ కోసం రష్మిక మందన్న రూ.2 కోట్ల పారితోషికం తీసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. ఇప్పుడు పుష్ప 2 సినిమా కోసం రష్మిక ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం అందుకుంది అనే వార్తలు వస్తున్నాయి. అల్లు అర్జున్ ఈ సినిమా కోసం రూ.150 కోట్ల పారితోషికం తీసుకోగా, దర్శకుడు సుకుమార్ సైతం రికార్డ్ స్థాయి పారితోషికం తన ఖాతాలో వేసుకున్నాడు. హీరోయిన్ రష్మిక మందన్న సైతం ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం అందుకోవడం జరిగింది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని ప్రస్తావిస్తే అంతా నిజం కాదని, పుకార్లు నమ్మవద్దు అంటూ నవ్వేసింది. ఆమె నో అన్నా పుష్ప 2 కోసం రష్మిక తీసుకున్న పారితోషికం తక్కువ కాదని ప్రతి ఒక్కరు అంటున్నారు. దాదాపు రెండేళ్ల పాటు పుష్ప 2 సినిమా కోసం డేట్లు కేటాయించింది. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో సినిమా చేయాలని భావించి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత పుష్ప 2 సినిమా కోసం ఎక్కువ డేట్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఆ సినిమాను క్యాన్సల్ చేసుకుంది. నితిన్ సినిమా మాత్రమే కాకుండా మరికొన్ని సినిమాలను సైతం రష్మిక మందన్న పుష్ప 2 సినిమా కోసం క్యాన్సల్ చేసుకుంది. అందుకు పుష్ప 2 సినిమా కోసం ఆమెకు రూ.10 కోట్ల పారితోషికం ఎక్కువ ఏం కాదని అంతా భావిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ వారు రష్మిక మందన్నకు ఇచ్చిన పారితోషికం సౌత్‌లోనే అత్యధికం అనే టాక్ వినిపిస్తూ ఉంది. లేడీ సూపర్ స్టార్ నయనతార నాలుగు నుంచి ఆరు కోట్ల రూపాయల పారితోషికంను అందుకుంటూ ఉంటుంది. ఇతర హీరోయిన్స్ సైతం అటు ఇటుగా మూడు నుంచి అయిదు కోట్ల పారితోషికం అందుకుంటారు. కానీ రష్మిక మందన్న ఏకంగా బాలీవుడ్ ముద్దుగుమ్మల స్థాయిలో ఏకంగా రూ.10 కోట్ల పారితోషికం అందుకోవడం ద్వారా తన స్టార్‌డమ్‌ను నిలుపుకుంది. ఇక మీదట రష్మిక తన ప్రతి సినిమాకు అదే స్థాయిలో పారితోషికం తీసుకుంటుందా అంటే సాధ్యం కాకపోవచ్చు.. కానీ తదుపరి సినిమాలకు ఈమె రూ.5 కోట్లకు పైగానే పారితోషికంగా అందుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ ఆమె సన్నిహితులు మాట్లాడుకుంటూ ఉన్నారు. రష్మిక మందన్న వచ్చే ఏడాది మరో రెండు బాలీవుడ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# నయన్ భర్త బెదిరిపోయాడా?



కోలీవుడ్‌లో హీరో ధనుష్, నయనతార మధ్య నడుస్తోన్న వివాదం గురించి అందరికి తెలిసిందే. నయనతార లైఫ్ స్టోరీని నెట్ ఫ్లిక్స్ డాక్యుమెంటరీ ఫిల్మ్‌గా రిలీజ్ చేసింది. దీనికి మంచి స్పందన వస్తోంది. అయితే ఇందులో నయనతార విగ్నేష్ శివన్ షూటింగ్ సెట్ లో మాట్లాడుకుంటున్న ఒక వీడియో బిట్ ని యూజ్ చేశారు. అది ధనుష్ నిర్మించిన 'నేను రౌడీనే' సినిమా షూటింగ్ సమయంలో షూట్ చేసింది. దీంతో ధనుష్ నయనతార మీద కేసు వేశారు. పర్మిషన్ లేకుండా తన సినిమా షూటింగ్ కి సంబంధించిన వీడియోని వినియోగించుకున్నందుకు 10 కోట్లు చెల్లించాలని కోర్టు ద్వారా నోటీసులు పంపించారు. దీనికి కౌంటర్ గా నయనతార బహిరంగ లేఖ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ ఇష్యూ కోర్టు పరిధిలో ఉంది. నయనతార కూడా ఈ కేసు విషయంలో వెనక్కి తగ్గలేదు. న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధమైంది. అయితే కోలీవుడ్ ఇండస్ట్రీలో మాత్రం వీరి వివాదం చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో కూడా ధనుష్ ఫ్యాన్స్ నయనతార, విగ్నేష్ శివన్ ని ట్యాగ్ చేసి విమర్శలు చేస్తున్నారు. విగ్నేష్ కు దర్శకుడికి లైఫ్ ఇచ్చింది ధనుష్ అని కౌంటర్ ఇస్తున్నారు. ఇక ఈ విషయంలో నయన్ రియాక్ట్ అయినట్లు ఆమె భర్త అసలు రియాక్ట్ కావడం లేదు. మరోవైపు నయనతార అభిమానులు కూడా ధనుష్ ఫ్యాన్స్ కి కౌంటర్లు ఇస్తున్నారు. ఇండస్ట్రీలో కూడా కొందరు నయనతారకి మద్దతుగా నిలిచారు. రీసెంట్ గా నయనతార పరోక్షంగా ధనుష్ పైన సోషల్ మీడియాలో విమర్శలు చేసింది. ఇది అప్పు అనుకో కచ్చితంగా దానికి వడ్డీతో సహా తిరిగొస్తుంది అంటూ చేసిన కామెంట్ వైరల్ గా మారింది. ఈ వివాదం ఇలా నడుస్తూనే ఉండటంతో కోలీవుడ్ లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉంటే నయనతార భర్త, దర్శకుడు విగ్నేష్ శివన్ తాజాగా ట్విట్టర్ అకౌంట్ డీయాక్టివిట్ చేశారు. కారణం చెప్పలేదు కానీ.. ట్విట్టర్ లో అనవసరమైన న్యూసెన్స్ క్రియేట్ అవుతుందనే ఉద్దేశ్యంతో సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని విగ్నేష్ డిసైడ్ అయినట్లు కోలీవుడ్ ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. ఇక మరికొందరు విగ్నేష్ భార్యకు సపోర్ట్ చేయలేక, ధనుష్ ని ఏమి అనలేక బెదిరి సోషల్ మీడియా నుంచి తప్పుకున్నట్లు టాక్ వస్తోంది. ప్రస్తుతం విగ్నేష్ శివన్ ప్రస్తుతం ప్రదీప్ రంగనాథ్ తో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే మూవీ చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇలాంటి సమయంలో సోషల్ మీడియాలో జరిగే ట్రోలింగ్, విమర్శలకి దూరంగా ఉండాలని ట్విట్టర్ డీయాక్టివేట్ చేసి ఉంటాడనే మాట వినిపిస్తోంది.

# 8 వారాల్లో తేజ ఎంత సంపాదించాడో తెలుసా..?

బిగ్ బాస్ సీజన్ 8 లో ఈ వారం డబల్ ఎలిమినేషన్ లో భాగంగా శనివారం హౌస్ నుంచి టేస్టీ తేజా ఎలిమినేట్ అయ్యాడు. హౌస్ లో గత వారం మెగా చీఫ్ అయిన రోహిణి తప్ప మిగతా వారంతా కూడా నామినేషన్స్‌లోకి వచ్చారు. ఐతే ఈ నామినేషన్స్ లో లీస్ట్ ఓటింగ్ రావడంతో తేజ ఎలిమినేట్ అయ్యాడు. ఐతే ఆదివారం మరొక హౌస్ మేట్ కూడా బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వస్తారని తెలుస్తుంది. ఇదిలా ఉంటే సీజన్ 7 లో 10 వారాల దాకా ఉన్న తేజ ఈ వారం ఎనిమిది వారాలు మాత్రమే ఉన్నాడు. సీజన్ 8 లో అతను వైల్డ్ కార్డ్ ఎంట్రీగా అక్టోబర్ 2న హౌస్ లోకి వెళ్లాడు. దాదాపు ఎనిమిది వారాల పాటు అతని ఎంటర్టైన్మెంట్ తో మెప్పించాడు. టాస్కుల్లో కూడా లాస్ట్ సీజన్ తో పోల్చితే ఈ సీజన్ లో తేజా తన బెస్ట్ ఇచ్చాడు. ఐతే లాస్ట్ సీజన్ తో పోల్చితే ఈ సీజన్ అతని రెమ్యునరేషన్ కూడా ఎక్కువే అన్నట్టు తెలుస్తుంది. వారానికి 4 లక్షల చొప్పున అగ్రిమెంట్ తో తేజ హౌస్ లోకి వెళ్లాడు. అంటే ఈ సీజన్ లో 8 వారాలు హౌస్ లో ఉన్నాడు కాబట్టి 32 లక్షల దాకా పారితోషికం అందుకుంటున్నాడు. తేజ ఎలిమినేషన్ అందరు ఊహించినదే. ఎందుకంటే ఆట చివరి దశకు వస్తుండటం వల్ల స్ట్రాంగ్ కంటెస్టెంట్స్ మధ్య పోటీ పెరుగుతుంది. ఈ క్రమంలో ఆడియన్స్ ఒక్కొక్కరినీ ఎలిమినేట్ చేస్తారు. ఓటింగ్ పర్సెంటేజ్ లో తక్కువ ఉన్న వారంతా కూడా ఎలిమినేట్ అవ్వక తప్పదు. బిగ్ బాస్ సీజన్ 8 మరో రెండు వారాలు మాత్రమే ఉంటుంది. ఇప్పటికే అవినాష్ ఒక ఫైనలిస్ట్ అయ్యాడు మరో నలుగురు ఎవరన్నది తెలియాల్సి ఉంది. తేజ మళ్లీ హౌస్ లోకి వచ్చింది తన మదర్ ని ఫ్యామిలీ వీక్ కు తీసుకు రావాలనే.. ఐతే ఆ కోరిక నెరవేర్చాడు. సో ఫ్యామిలీ వీక్ అయ్యి రెండు వారాలు అవుతుంది అమ్మని హౌస్ లోకి తీసుకొచ్చిన రోజే తాను గెలిచానని తేజ అన్నాడు. మొత్తానికి సీజన్ 8లో తేజ ఆట ముగిసింది. 8 వారాలకు గట్టిగానే రెమ్యునరేషన్ అందుకున్నాడు. బిగ్ బాస్ సీజన్ 7 కన్నా సీజన్ 8 తోనే తేజా ఎక్కువ పారితోషికం అందుకున్నాడని తెలుస్తుంది.



# రోహిత్ శర్మ కొడుకు పేరు ఎంటో తెలుసా..? సోషల్ మీడియాలో నేమ్ రిలీవ్ చేసిన రితికా..!

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, రితికా దంపతులకు ఇటీవల తనయుడు జన్మించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రోహిత్ దంపతులు తనయుడి పేరును గానీ, ఫొటోనుగానీ అభిమానులతో పంచుకోలేదు. ఈ క్రమంలో హిట్‌మ్యాన్ అభిమానులంతా ఏం పేరు పెట్టారు? అని తెలుసుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. ఈ క్రమంలో రితికా తనయుడి పేరును సోషల్ మీడియా వేదికగా రివీల్ చేసింది. రోహిత్ - రితికా జంట తనయుడికి 'అహాన్' అని పేరు పెట్టినట్లు ఇన్‌స్టా స్టోరీలో రితికా పేర్కొంది. క్రిస్మస్ నెల ప్రారంభమైన నేపథ్యంలో సెలబ్రేషన్స్ మొదలయ్యాయంటూ పేర్కొంది. ఫొటోలో నాలుగు శాంటాక్లాజ్‌లు ఉండడం విశేషం. ప్రస్తుతం రోహిత్ కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఇప్పటికీ ఈ జంటకు తనయ సమైరా ఉన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తనయుడి పేరును రివీల్ చేసిన రితికా.. ఎక్కడ ఆ పేరును పెట్టినట్లు చెప్పకుండా.. శాంటాలకు పేర్లు రాసి షేర్ చేయడం విశేషం. శాంటాలకు రో, రిట్స్, సమ్మి, అహాన్ పేరు రాసి ఉన్న ఫొటోను షేర్ చేయడం అభిమానులను ఆకట్టుకున్నది. ఇక అహాన్ పేరుకు అర్థం ఏంటో తెలుసుకునేందుకు పలువురు అభిమానులు ప్రయత్నించారు. అహాన్ అనే పేరుకు అర్థాలు చాలానే ఉన్నాయి. సూర్యోదయం, ఆశాకిరణం, ఆరంభం అనే అర్థనాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది. అక్కడ ఐదు టెస్ట్ సిరీస్‌లో తలపడుతున్నది. ఇప్పటికే 1-0తో ఆధిక్యలో ఉన్నది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌కు రోహిత్ దూరమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రైమ్ మినిస్టర్ లెవెన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ జరుగుతున్నది.





# ఆసీస్ పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్... టీమిండియాదే పైచేయి

**సిడ్నీ-నవభూమి:** ఆసీస్ పీఎం ఎలెవన్ జట్టుపై టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ కోసం టీమిండియా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. నవంబరు 22న ప్రారంభమైన తొలి టెస్టులో టీమిండియానే విజేతగా నిలిచింది. టీమిండియా-ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్టు డిసెంబరు 6 నుంచి అడిలైడ్ వేదికగా జరగనుంది. అయితే, ఈ టెస్టు డే/నైట్ విధానంలో పింక్ బాల్ తో జరగనుంది. అందుకోసం టీమిండియా... ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవన్ జట్టుతో రెండ్రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతోంది.

కాన్ బెర్రాలోని మనూకా ఓవల్ లో నేడు ప్రారంభమైన ఈ మ్యాచ్ లో తొలిరోజున టీమిండియాదే పైచేయిగా నిలిచింది. టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. దాంతో, మొదట బ్యాటింగ్ కు దిగిన పీఎం ఎలెవన్ జట్టు తొలి ఇన్నింగ్స్ లో 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌట్ అయింది. యువ బౌలర్ హర్షిత్ రాణా 4 వికెట్లతో సత్తా చాటాడు. ఆకాశ్ దీప్ 2, సిరాజ్ 1, ప్రసిద్ధ్ కృష్ణ 1, వాషింగ్టన్ సుందర్ 1, రవీంద్ర జడేజా 1 వికెట్ తీశారు. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్ జట్టులో ఓపెనర్ శామ్ కోన్ స్టాస్ (107) సెంచరీతో రాణించాడు. మిడిలార్డర్ లో జాక్ క్లేటన్ 40 పరుగులు చేయగా... లోయరార్డర్ లో హన్నో జాకబ్స్ 61 పరుగులు చేశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ లో 5 వికెట్లకు 257 పరుగులు చేసింది.

# హైబ్రిడ్‌కు ఓకే కానీ.. ఐసీసీ అల్టిమేటంతో వెనక్కి తగ్గిన పీసీబీ



**దుబాయ్/కరాచీ-నవభూమి:** చాంపియన్స్ ట్రోఫీ(2025) నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. హైబ్రిడ్ మోడల్ విషయంలో ఐసీసీ అల్టిమేటంకు ఒకింత వెనుకకు తగ్గిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) పలు డిమాండ్లు ముందుపెట్టింది. ఓవైపు హైబ్రిడ్ పద్ధతికి ఓకే అంటూనే వచ్చే మూడేండ్లు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలకు ఇదే పద్ధతి వర్తింపజేయాలని షరతులు పెట్టింది. శనివారం చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై పీసీబీ చీఫ్ మోహిసిన్ నక్వీ స్పందిస్తూ ' టోర్నీ నిర్వహణపై నేను అతిగా మాట్లాడాను.

అలా చేస్తే పరిస్థితులు ఇంకా క్లిష్టంగా మారుతాయి. మేము మా ప్రతిపాదనలు ఐసీసీ ముందు ఉంచాం, భారత్ కూడా వారి సిఫార్సులు చెప్పింది. ఏ నిర్ణయం తీసుకున్నా..అది అందరికీ సమానంగా ఉండాలి. అంతిమంగా క్రికెట్ గెలువాలన్నదే మా తపన అదే సమయ ంలో పాకిస్థాన్ ఆత్మగౌరవం కూడా ముఖ్యమే' అని అన్నాడు. దీనికి తోడు వార్షిక ఆదాయ వాటాలను కూ డా ఐసీసీ పెంచాలని పీసీబీ డిమాండ్ చేస్తున్నది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**